9. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

సోమవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 272 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## ప్రపంచ విజేత టీమిండియాకు ప్రధాని మోదీ అభినందనలు

టీ20 వరల్డ్ కప్ విజేతగా నిలిచిన టీమిండియా

2 లో..

ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం

అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా మ్యాచ్

భారత జట్టుపై ప్రశంసల వర్షం కురిపించిన ప్రధాని మోదీ



## త్వరలోనే తెలంగాణలో
# ఉచిత స్కూటీలు



- విద్యార్థినులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీల పంపిణీ
- 2026 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులు
- నగరంలోని డీజిల్ బస్సులు జిల్లాలకు తరలింపు
- ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై జీరో ట్యాక్స్ విధానం

**హైదరాబాద్ వెలుతురు మార్చి 08:** దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ సిటీలు ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితులు సమీప భవిష్యత్తులో హైదరాబాద్‌కు తలెత్తకుండా నివారించడంతో పాటు ఈ నగరాన్ని ప్రపంచంలోనే మేటి నగరాలతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. కాలుష్య నియంత్రణలో భాగంగా హైదరాబాద్‌లో తిరిగే ఆర్టీసీ బస్సులను 2026 డిసెంబర్ 9 నాటికి వంద శాతం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టబోతున్నామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జ్యోతిరావు పూలే భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మహిళా జర్నలిస్టులను సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, హైదరాబాద్‌ను కాపాడుకోవడానికి, అంతర్జాతీయ నగరంగా రాణించడానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వానికి అందరి సహకారం కావాలని కోరారు. "దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలు ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయో మహిళా జర్నలిస్టులు విశ్లేషించాలి. వర్షాలొస్తే ముంబయ్ అతలాకుతలమవుతోంది. వాయు కాలుష్యంతో ఢిల్లీ సతమతమవుతోంది. బెంగుళూరులో ట్రాఫిక్ సమస్యలు, వరదలొచ్చినప్పుడు చెన్నైలో ఏర్పడే ప్రమాదకర పరిస్థితులను గమనిస్తూనే ఉన్నాం. సమీప భవిష్యత్తులో హైదరాబాద్ నివాసయోగ్యం కాని నగరంగా మారే పరిస్థితులు రావొద్దు. ఇలాంటి పరిస్థితులు హైదరాబాద్ నగరానికి తలెత్తకూడదనే ప్రణాళికలు రూపొందించాం. హైదరాబాద్‌లో వాయు నాణ్యత

# జై హో భారత్
## వరల్డ్ ఛాంపియన్ భారత్...




- టీ20 ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర..
- న్యూజిలాండ్ పై అల్టిమేట్ విక్టరీ
- 2007, 2024 తర్వాత మూడోసారి టీ20 ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత్
- పొట్టి కప్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి జట్టుగా టీమిండియా ప్రపంచ రికార్డు
- ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం
- బ్యాటింగ్‌లో సంజూ శాంసన్ (89), బౌలింగ్‌లో బుమ్రా (4/15) అద్భుత ప్రదర్శన
- అహ్మదాబాద్ వేదికగా 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత్

**అహ్మదాబాద్, వెలుతురు మార్చి 08:** టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా మరోసారి విశ్వరూపం చూపించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన తుది పోరులో న్యూజిలాండ్‌ను చిత్తుచేసి విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 2007, 2024 తర్వాత ఇది టీమిండియాకు మూడో టీ20 వరల్డ్ కప్ కావడం విశేషం.





## వాసవీ పారాయణ గీతం ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ వెలుతురు మార్చి 08:** ఈనెల 22న తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజాత గుప్తా ఆధ్వర్యంలో తలపెట్టిన శ్రీ వాసవి మహాశక్తి మహోత్సవంలో పాడనున్న వాసవీ మాత పారాయణ గీతాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం ఆవిష్కరించారు. ఈ గీతాన్ని డాక్టర్ చింతల శ్రీనివాస్ రచించగా గాయని కల్పన స్వరపరిచి, ఆలపించారు. హైదరాబాద్ ఎల్ బీ స్టేడియంలో 30 వేల మందికి పైగా ఆర్యవైశ్యులు దీనిని సామూహికంగా పారాయణం చేస్తారని కల్వ సుజాత మంత్రి సురేఖకు తెలిపారు. ఇది ప్రపంచ రికార్డు కానుందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. కల్వ సుజాతను, నిర్వాహకులను అభినందించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బెల్ది శ్రీధర్, రమాకాంత్, నాగేశ్వరరావు, సంతోష్, సంపత్, చైతన్య, సాంబశివరావు, రమేష్, దీప్తి, కవిత, నిఖిత, హారిక , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



### ప్రజలకు అద్భుతమైన సంస్కృతిని అందించడానికి
## బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు

శివరాంపల్లి లో హైడ్రా పునరుద్ధరించిన బం-రుక్న్-ఉద్-దౌలా చెరువును ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు మార్చి 08:** హైదరాబాద్ మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా నది పరివాహక ప్రాంతాన్ని నైట్ ఎకానమీ కొనసాగే విధంగా అభివృద్ధి చేయడం ద్వారా ఈ ప్రాంతంలోని యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు పేర్కొన్నారు. హైదరాబాద్ శివరాంపల్లిలో పునరుద్ధరించి అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును ముఖ్యమంత్రి గారు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, ఎంపీలు అసదుద్దీన్ ఓవైసీ గారు, అనిల్ కుమార్ యాదవ్ గారితో పాటు ప్రజా

## FIA హాకీ మహిళల ప్రపంచ కప్ క్వాలిఫైయర్స్ 2026 టోర్నమెంట్ ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు మార్చి 08:** హైదరాబాద్ గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రతిష్టాత్మక మహిళల హాకీ ప్రపంచ కప్ 2026 క్వాలిఫైయర్స్ టోర్నమెంట్‌ను ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు





- 200 సార్లు ఫోన్ చేసినా రేవంత్ రెడ్డి నాకు అపాయింట్ మెంట్ ఇవ్వడంలేదు
- మా జాతి సమస్యలు చెప్పుకుందామని రెండున్నర ఏళ్ల నుండి ప్రయత్నిస్తుంటే కలవడం లేదు
- నిన్న జరిగిన మాదిగల సన్మాన సభకు కూడా నన్ను పిలవలేదు
- వందల కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ మా వర్గానికి ఒకటే ఇచ్చారు
- అన్ని చోట్ల మా వర్గానికి అన్యాయమే చేశారు కాంగ్రెస్ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు

హైదరాబాద్ వెలుతురు మార్చి 08:

## సాఫ్ట్ వేర్ ఉద్యోగులు
# రైతులుగా మారే రోజులు రావాలి

## రైతును రాజు చేయడమే మోదీ లక్ష్యం

## జైకిసాన్ నినాదాన్ని ఆచరణలో చూపుతున్న కేంద్రం

- రైతులకు ఎమ్మెస్పీ ధరను రెట్టింపు చేయాలనే లక్ష్యం నెరవేరుస్తున్నారు
- కిసాన్ సమ్మాన్ నిధి, క్రెడిట్ కార్డ్, ఫసల్ బీమా, ఎఫ్పీవోల పేరుతో విస్త్రత పథకాలను అమలు చేస్తున్న మోదీ
- దేశానికి అన్నం పెడుతున్న రైతును ఆదుకోవడం మనందరి కర్తవ్యం
- రైతులకు లాభం కలిగించేందుకు కేవీకే చేస్తున్న క్రుషి అభినందనీయం
- ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాగయ్య చేస్తున్న సేవలు అద్భుతం



- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్...
- నర్సాపూర్ తునికీ కేవీకే ఫార్మర్స్ హాస్టల్, వాల్యూ అడిషన్ ఫుడ్ ల్యాబ్‌లను ప్రారంభించిన కేంద్ర మంత్రి

**మెదక్ జిల్లా వెలుతురు మార్చి 08:** ఉద్యోగులు కూడా రైతులుగా మారి వ్యవసాయం చేసే స్థాయికి రావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆకాంక్షించారు. దేశానికి అన్నం పెడుతున్న రైతులు తన కాళ్లమీద తాను నిలబడేందుకు ప్రత్యేకంగా శిక్షణిస్తూ వారి పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసి విక్రయిస్తూ లాభాలు గడించేలా శిక్షణ ఇస్తున్న ఏకలవ్య గ్రామీణ ఫౌండేషన్, క్రుషి విజాన కేంద్రం చేస్తున్న క్రుషి మరువలేనిదని కొనియాడారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం

## ఘనంగా "విశ్వ మహిళ బాపు బొమ్మ పురస్కారం 2026"





**హైదరాబాద్ వెలుతురు మార్చి 08:** జూబ్లీహిల్స్‌లోని హోటల్ దస్పల్లాలో సినీనటి ఆధ్వర్యంలో నిర్వహించిన "విశ్వ మహిళ బాపు బొమ్మ పురస్కారం 2026" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన గారు విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ గారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కళ, సాహిత్యం, సామాజిక సేవ, మీడియా, వ్యాపార రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలు దేశ అభివృద్ధికి ముఖ్యమైనవని పేర్కొన్నారు. మహిళల సాధనను గౌరవిస్తూ వారికి ప్రోత్సాహం అందించే ఇటువంటి పురస్కారాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని ఆయన అన్నారు.

## జై హో భారత్.. వరల్డ్ ఛాంపియన్ భారత్...

మూడు సార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలిజట్టుగా టీమిండియా రికార్డు నెలకొల్పింది. దాంతోపాటే, ఆతిథ్య జట్టు వరల్డ్ కప్ నెగ్గడం కూడా ఇదే తొలిసారి. అంతేకాదు, టీ20 ప్రపంచకప్ చరిత్రలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి, టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా టీమిండియా రికార్డులకెక్కింది. సొంతగడ్డపై జరిగిన ఈ మెగా ఫైనల్లో భారత్ ఏకంగా 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించి ట్రోఫీని ముద్దాడింది. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. భారత బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత పేస్ దళపతి జస్ప్రీత్ బుమ్రా తన మ్యాజిక్ బౌలింగ్‌తో కివీస్ పతనాన్ని శాసించాడు. కేవలం 15 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ టిమ్ సీఫెర్ట్ (52), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (43) మాత్రమే పోరాడారు. వీరిద్దరూ మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలవలేకపోయారు. ముఖ్యంగా డారిల్ మిచెల్ (17), ఫిన్ అలెన్ (9), రచిన్ రవీంద్ర (1) వంటి స్టార్ ప్లేయర్లు విఫలమవడంతో కివీస్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో బుమ్రా 4, అక్షర్ పటేల్ 3 వికెట్లు పడగొట్టగా.. హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ తలో వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. న్యూజిలాండ్ బౌలర్లపై విరుచుకుపడింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ కేవలం 7.1 ఓవర్లలోనే 98 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అభిషేక్ శర్మ 21 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 52 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ (54)తో కలిసి సంజూ శాంసన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా శాంసన్ కివీస్ బౌలర్లను ఊచకోత కోశాడు. 46 బంతుల్లో 5 ఫోర్లు, ఏకంగా 8 సిక్సర్లతో 89 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. చివర్లో శివమ్ దూబే (26 నాటౌట్) ధాటిగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూర్యకుమార్ యాదవ్ డకౌట్ అయినా.. టీమిండియా సమిష్టి ప్రదర్శనతో మూడోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.

## ప్రజలకు అద్భుతమైన సంస్కృతిని అందించడానికి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు

ప్రతినిధులు, ఉన్నధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజలకు అద్భుతమైన సంస్కృతిని అందించడానికి బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని చెప్పారు. హైదరాబాద్‌లో చెరువులను పునరుద్ధరించిన ప్రాంతాల్లో నైట్ ఎకానమీ కొనసాగే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. "స్థానిక పౌరులకు మంచి వాతావరణం కల్పించాం. ఇక్కడ ఆడబిడ్డలు స్వేచ్ఛగా ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్ చేసుకోవడానికి ఇక్కడ లేక్ పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. అలాగే, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ లేక్స్ వద్ద స్టాల్స్ పెట్టి స్థానికులు పాలు, పండ్లు, కూరగాయలు పరిశుభ్రమైన వాతావరణంలో అమ్ముకోవడానికి వీలు కల్పిస్తాం. 99 రోజుల 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా హైదరాబాద్‌లో అనేక కార్యక్రమాలు చేపట్టాం. ఒకప్పుడు హైదరాబాద్ రాక్స్, లేక్స్ తో ప్రపంచంలోనే సుందరమైన నగరంగా ఉండింది. ఈ నగరం మనది. దీన్ని రక్షించుకోవలసిన బాధ్యత కూడా అందరిపైన ఉంది. ఈ మహానగరానికి పూర్వ వైభవం తీసుకురావాలన్న సంకల్పంతో ఆక్రమణలకు గురైన చెరువులు, నాలాలను తొలగించే కార్యక్రమం చేపట్టాం. ఇది ఓల్డ్ సిటీ కాదు. ఒరిజినల్ సిటీ. ఈ సిటీని అభివృద్ధి చేయడానికి అనేక ప్రాజెక్టులు చేపట్టాం. రెండు రోజుల కిందట కొత్వాల్ గూడ ఎకో పార్క్ ను ప్రారంభించుకున్నాం. సాధ్యమైన తొందరగా మెట్రో విస్తరణ పనులను పూర్తి చేస్తాం. మిరాలం ట్యాంక్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. పక్కనే హైకోర్టు నూతన భవన నిర్మాణం సాగుతోంది. ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తున్నాం. హైదరాబాద్ అత్యంత పురాతన, ప్రాముఖ్యత కలిగిన నగరం. ఆ ప్రాభవం కోల్పోయే ప్రమాదం ఉంది. దీన్ని ఒక సుందరమైన నగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. బతుకమ్మ కుంటను అభివృద్ధి చేశాం. ఏడాది కిందట బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు ఎలా ఉంది. ఇప్పుడేలా ఉంది. ఈ ఒరిజినల్ సిటీని అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను చూడండి. ఆ పనులను చూసి ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి... అని ముఖ్యమంత్రి గారు ముస్లిం సోదర సోదరీమణులకు ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## FIA హాకీ మహిళల ప్రపంచ కప్ క్వాలిఫైయర్స్ 2026 టోర్నమెంట్ ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రారంభించారు. భారత్‌కు ఉరుగ్వే జట్టుకు మధ్య మ్యాచ్‌ను ముఖ్యమంత్రి గారు లాంఛనంగా ప్రారంభించారు. వచ్చే ఆగస్టులో బెల్జియం, నెదర్లాండ్స్‌లో జరగనున్న ప్రపంచ హాకీ కప్ కోసం క్వాలిఫైయర్స్ మ్యాచ్‌లు హైదరాబాద్‌లో జరుగుతున్నాయి. 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఈ క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల టోర్నమెంట్‌లో 8 దేశాలు పాల్గొంటున్నాయి. గ్రూప్‌ఏలో ఆస్ట్రియా, ఇంగ్లండ్, ఇటలీ, కొరియా దేశాలు, గ్రూప్‌బీలో ఇండియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారితో పాటు మంత్రులు వాకిటి శ్రీహరి గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ గారు, తెలంగాణ ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి గారు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గారు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి గారు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా "విశ్వ మహిళ బాపు బొమ్మ పురస్కారం 2026"

ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన దివ్యవాణి గారిని మహేష్ కుమార్ గౌడ్ గారు అభినందించారు. మహిళల ప్రతిభను వెలికితీసి సమాజానికి పరిచయం చేసే వేదికగా "విశ్వ మహిళ బాపు బొమ్మ పురస్కారం" కార్యక్రమం నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సినీ, సాంస్కృతిక, సామాజిక రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. మహిళా సాధికారతకు కృషి చేస్తున్న మహిళలను సన్మానిస్తూ అవార్డులు అందజేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

## ప్రపంచ విజేత టీమిండియాకు ప్రధాని మోదీ అభినందనలు

**అహ్మదాబాద్, వెలుతురు మార్చి 08:**

ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు చరిత్ర సృష్టించింది. ఇవాళ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించి విశ్వవిజేతగా నిలిచింది. ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా.. కివీస్ జట్టుపై ఏకంగా 96 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి కప్‌ను ముద్దాడింది. ఈ విజయంతో దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. భారత జట్టు సాధించిన ఈ అద్భుత విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. "ఛాంపియన్స్.. టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టుకు హృదయపూర్వక అభినందనలు" అంటూ ప్రధాని ప్రశంసించారు. ఈ గెలుపు జట్టు అద్భుతమైన నైపుణ్యాలు, దృఢ సంకల్పం, టీమ్ వర్క్‌కు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. టోర్నమెంట్ ఆసాంతం భారత ఆటగాళ్లు చూపిన పోరాట పటిమ అమోఘమని మోదీ కొనియాడారు. ఈ విజయం ప్రతి భారతీయుడి గుండెను గర్వంతో, ఆనందంతో నింపిందని తెలిపారు. "వెల్ డన్ టీమ్ ఇండియా" అంటూ ప్రధాని తన సందేశంలో భారత ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. సొంతగడ్డపై జరిగిన ఈ మెగా టోర్నీలో భారత జట్టు కప్ గెలవడం క్రీడా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది.

# మహిళల రక్షణ మన అందరి బాధ్యత

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి






**మేడ్చల్ జిల్లా ప్రతినిధి మార్చి 07 (వెలుతురు):** అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని జరుపుకోవడం ద్వారా మన బాధ్యత తీరిపోదని, మన కుటుంబ సభ్యులకు జరిగే అసౌకర్యం గానీ అవమానం గానీ మనం ఏ విధంగా ఆలోచన చేస్తామో, సమాజంలో ప్రతి మహిళల పట్ల కూడా మనం అదే విధంగా ఆలోచన చేసి దానికి అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలి అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం కెపిహెచ్ బి లోని జెఎన్టియూ ఆడిటోరియంలో వుమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డిజిపి చారు సిన్హా ఐపిఎస్, పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "స్టాండ్ విత్ హర్" కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి, హైదరాబాదు పోలీస్ కమీషనర్ సజ్జనార్, హయ్యర్, స్కూల్ ఎడ్యూకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరి యోగితారాణా, మహిళ శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, సైబరాబాద్ పోలీస్ కమీషనర్ ఎం రమేష్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, సైబరాబాదు మున్సిపల్ కమీషనర్ సృజన, యూనిసెఫ్ ఛీఫ్ ఫీల్డ్ ఆఫీసర్ జలాలీమ్ బిర్హాను టఫెస్సా, ప్రముఖ సిని నటుడు సాయి దుర్గ తేజ్, హాయజయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలనే ఒక మంచి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిలో మహిళల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించడం అలవాడాలన్నారు. మహిళల పట్ల మనమందరం .స్టాండ్ విత్ హర్ అని ఆలోచించి ఒక బాధ్యతగా తీసుకుంటే ఖచ్చితంగా నూటికి నూరు శాతం తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ అందించడం కష్టం కాదన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరి ఆలోచనలో మార్పురావాలన్నారు. . అందుకే మహిళల రక్షణ కోసం తెలంగాణ యువకులు ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా నిలబడి మనం ఎంత విజయం సాధించినా మహిళలను ఆర్థికంగా నిలబెట్టినప్పుడే ఆ కుటుంబము, ఆ రాష్ట్రము, ఆ దేశము ఆర్థికంగా బలపడుతుంది. తెలంగాణ రాష్ట్రం 2034కి 1 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ, 2047కి 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ రీచ్ అవ్వాలి అని అంటే సమాజంలో సగభాగమైన ఆడపిల్లలకు రక్షణ ఉండాలని, రక్షణ ఉన్న ఆడపిల్లలు ఆర్థికంగా ఎదగాలి, ఆర్థికంగా ఎదగాలి అంటే వాళ్ళు చదువుకోవాలి. వంటింటి కుందేళ్ళుగా ఇంటికే పరిమితం కాకుండా వాళ్లలో ఉన్న శక్తి నైపుణ్యాన్ని ఈరోజు వాళ్ళు అభివృద్ధి చేసుకొని తెలంగాణ ఎకానమీలో వాళ్ళని భాగస్వాములను చేయాలన్నదే మా ప్రభుత్వం యొక్క ఆలోచన అన్నారు. ఈరోజు ప్రపంచంలో ఏ అభివృద్ధి చెందిన దేశాన్నైనా చూడండి, ఏ దేశంలో అయితే మహిళలు ఇంట్రప్రెన్యూర్స్‌గా, మహిళా ఎంప్లాయీస్‌గా, మహిళలు సైంటిస్టులుగా లేకపోతే డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లుగా రాణించారో ఆ దేశమే ఆర్థిక పురోగతి సాధించినాయని, తెలంగాణ రాష్ట్రం కూడా ఆర్థిక పురోగతి వైపు వేగంగా ప్రయాణం చేస్తుందన్నారు. మహిళలు ఇంకా రాణించాలి, ధైర్యంగా వాళ్ళు ఉద్యోగ ఉపాధి అవకాశాలను నిర్వహించాలి అని అంటే ఆ మహిళలకు రక్షణ ఉండాలి, ఆ రక్షణ కలిగించే బాధ్యత చట్టాలు చేయడమో పోలీసుల పహారాలు కాయడమో సరిపోదు, మనమందరం కూడా సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మనమందరం కూడా ఆ రక్షణ కల్పించినప్పుడు ఎవరైనా ఏదైనా వాళ్ళకి ఇబ్బంది కలిగించినప్పుడు వారికి అండగా నిలబడి సహాయమందించాలన్నారు. నాకెందుకులే అని చూసి చూడనట్టు ఉండటం కూడా ఒక రకంగా నేరాన్ని ప్రోత్సహించడమే అవుతుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే అందిస్తున్నామని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మహిళల పేరుతో, స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించి వారికి శిల్పారామం వద్ద దుకాణ సముదాయాన్ని కేటాయించామని, సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించి మహిళలు అదానీ, అంబానీలతో పోటీపడేలా చర్యలు చేపట్టామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశామని, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయించి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకుంటూ, మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి మహిళా శక్తి స్ఫూర్తిని చాటామన్నారు. మహిళా శక్తిపై రాష్ట్ర ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని, దేశంలోనే తెలంగాణను మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చి దిద్దాలనే స్టాండ్ విత్ హర్ కార్యక్రమం తీసుకున్నామన్నారు.

# మహిళా సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ అగ్రగామి






**హైదరాబాద్ వెలుతురు మార్చి 08:-** దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రభాగాన ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఇక్కడి ప్రజాభవన్ లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అతిధిగా పాల్గొని ప్రసంగించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలకే పెద్దపీట వేస్తున్నామని దీనిలో భాగంగా రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే ప్రక్రియలో భాగంగా సున్నా శాతం వడ్డీతో ఇంతవరకు 23వేల కోట్ల రూపాయిలను అందించడం జరిగిందన్నారు. అంతేగాక రానున్న కాలంలో దాదాపు 24- 25 వేల కోట్ల రూపాయిలను అందించి వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు సంకల్పించినట్లు తెలిపారు. సోలార్ ప్యానల్స్ , పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు, ప్రైవేటు బస్సులకు యజమానులుగా చేసే పథకాలతో పాటు ప్రత్యేకంగా తాను చూసే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్ల పట్టాలు మహిళల పేరిటే ఇస్తున్నామని తెలిపారు. మహిళాదినోత్సవం నాడు




ఈ ఏడాది మహిళా జర్నలిస్టుల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి సూచనల మేరకు ఈ ప్రత్యేక అభనందన కార్యక్రమం ఏర్పాటు చేశామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. రాష్ట్ర గౌరవాన్ని పెంచేలా మహిళలకు, మహిళా జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో కూడా వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రానున్న కాలంలో ప్రజలు ప్రభుత్వాన్ని సమన్వయం చేసేలా మీ నుంచి ఉత్తమ పాత్రికేయ సేవలు కావాలని మంత్రి పొంగులేటి అభిలషించారు.

## త్వరలోనే తెలంగాణలో ఉచిత స్కూటీలు

(ూాు×) ఇప్పటికే ఆరెంజ్ కేటగిరీలోకి చేరింది. మరింత ప్రమాదకంగా జీవించడానికి వీలులేని పరిస్థితులు తెచ్చుకోవద్దు. హైదరాబాద్‌లో చెత్త పేరుకుపోతోందని, దోమలు పెరిగాయనో, మూసీలో కాలుష్యం పారుతోందని, నియంత్రించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ప్రభుత్వం అందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టకుండా ఎలా సాధ్యం. నదుల్లో కాలుష్య నివారణకు ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, యూపీలో గంగా నది ప్రక్షాళన, గుజరాత్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు చేపట్టినట్టే, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ఎందుకు చేపట్టొద్దు. సుప్రీంకోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల మేరకు మూసీ నదికి సంబంధించి బఫర్ జోన్ విషయంలో 2012లో నిబంధనలు రూపొందించారు. నాలా అయితే బఫర్ జోన్ ఎంత ఉండాలి, చెరువులైతే ఎంత ఉండాలి, నదులైతే ఎంత ఉండాలన్నది ఖరారు చేశారు. ఆ మేరకు మూసీ నది వెంట నాలా అయితే 10 మీటర్లు, నదికి 50 మీటర్ల బఫర్ జోన్ ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. కాలుష్య కారక మూసీ నది పునరుజ్జీవ కార్యక్రమంలో నిర్వాసితులకు ప్రభుత్వం సరైన సహాయం అందిస్తుంది. ప్రాజెక్టును అడ్డుకోవడంకన్నా బాధ్యత కలిగిన వారంతా నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడం లేదా వారికి మరే ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వంతో చర్చించవచ్చు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు వద్ద ఒక అపార్ట్‌మెంట్‌పై ఈ మధ్య చర్చ జరుగుతోంది. 7 ఎకరాల ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్‌కు అంతే స్థలమిచ్చి, కొత్తగా నిర్మాణానికి అయ్యే ఖర్చును బ్యాంకులో డిపాజిట్ చేస్తామని చెప్పాం.



లేదా నష్టపరిహారం తీసుకుని వేరే ప్రాంతంలో కట్టుకుంటామన్నా ఇబ్బంది లేదని ప్రభుత్వం పలు ప్రత్యామ్నాయాలను సూచించింది. మూసీ రివర్ ఫ్రంట్ ఫేజ్ 1లో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 5 వేల కోట్లు, 10 వేల కోట్లు వెచ్చిస్తున్నారంటూ చిలువలు పలువలు చేసి ప్రచారం చేస్తున్నారు. గాంధీ విగ్రహం కోసం దాదాపు 70 కోట్లు, విజ్ఞాన కేంద్రం, ఆ ప్రాంత అభివృద్ధి మొత్తంగా 200 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. ఈ వాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాజెక్టు సమగ్ర ప్రణాళికపై ఈ నెల 13న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నాం. కాలుష్య నివారణలో భాగంగా 2026 డిసెంబర్ 9 నాటికి హైదరాబాద్‌లో ఆర్టీసీ ద్వారా వంద శాతం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెడుతాం. ప్రస్తుతం ఆర్టీసీలో 2800 బస్సులు డీజిల్‌తో నడుస్తున్నాయి. కాలుష్య నియంత్రణలో భాగంగా వాటి స్థానంలో 500 ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాం. డీజిల్ వాహనాలను ఓఆర్ఆర్ అవతలి ప్రాంతానికి తరలించి వాటి స్థానంలో డిసెంబర్ నాటికి నూరుశాతం ఈవీ బస్సులను ప్రవేశపెడుతాం. ఈవీ వాహనాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈవీ వాహనాలకు జీరో పన్ను పాలసీ తెచ్చాం. నగరంలో 2 లక్షల ఆటోలున్నాయి. డీజిల్, పెట్రోల్ ఇతర ఇంధన ఆధారంగా నడుస్తున్న ఈ ఆటోలను రెట్రోఫిటింగ్ కింద ఈవీలుగా మార్చాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నాం. నగరంలో కాలుష్య కారక రెడ్, ఆరెంజ్ కేటగిరీలోని పరిశ్రమలను నగరం అవతలి వైపునకు తరలిస్తున్నాం. దేశ జనాభాలో 2.5 శాతం ఉన్న తెలంగాణ జీడీపీలో 5 శాతం మేరకు దోహదపడుతున్న నేపథ్యంలో 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యాలను నిర్దేశించాం. 2047 నాటికి దేశ జీడీపీలో 10 శాతం తెలంగాణ నుంచి దోహదపడాలి. ఈ లక్ష్యసాధనలో మహిళలు సంపూర్ణంగా సహకరించాలి. మహిళా జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునిస్తుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేసే చోట మహిళలకు రక్షణ కోసం కమిటీలను ఏర్పాటు చేస్తాం. రక్షణ కల్పించడమే కాకుండా ప్రభుత్వం అవకాశాలను కల్పిస్తుంది. డెస్క్ జర్నలిస్టుల గుర్తింపు విషయంలో ఎవరికీ అన్యాయం జరగదు. మహిళలు ఆర్థికంగా ఎదిగిన కారణంగానే కొన్ని దేశాలు ఆర్థికంగా బలమైన దేశాలుగా నిలబడ్డాయి. సమాజంలో మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షకు ముగింపు పలకాలంటే మహిళల శక్తిని గుర్తించి సమాన అవకాశాలు కల్పించాలి. మహిళల శ్రమకు తగిన గుర్తింపు లభించడం లేదు. కష్టపడే వారికి గుర్తింపునివ్వాల్సిన బాధ్యత అందరిపైనా, ప్రభుత్వాలపైనా ఉంది. దేశంలో అగ్రస్థానంలో తెలంగాణను నిలపాలన్న లక్ష్య సాధనలో మహిళా జర్నలిస్టుల సహకారం ఉండాలి. మహిళలకు ప్రాధాన్యత కలిగిన రాష్ట్రంగా తెలంగాణకు గుర్తింపు తెచ్చుకుందాం.." అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, కొండా సురేఖ గారు, పొన్నం ప్రభాకర్ గారు, మహమ్మద్ అజహరుద్దీన్ గారు, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి గారు, ఐ అండ్ పీఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక గారితో పాటు మహిళా జర్నలిస్టులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 50 కోట్ల రూపాయల కార్పొరేట్ సంస్థల సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో స్త్రీల క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ల అందజేత...



**ఆదిలాబాద్ వెలుతురు మార్చి 08:**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది...స్త్రీల ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇస్తూ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు... ఇండియా ఆయిల్ కార్పొరేషన్ ×ూజూ. జూ= నిధులతో ఇచ్చోడ మరియు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రులకు సర్వైకల్ క్యాన్సర్ మరియు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ లను అందజేశారు... కార్పొరేట్ సంస్థ ద్వారా 50 కోట్ల రూపాయల సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ తో ఈ సామాజిక కార్యక్రమాలను చేపట్టారు.. ఎంపీ గోడం నగేష్ చొరవతో ఈ నిధులకు జిల్లాకు కేటాయించబడ్డాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థ సంబంధించిన సామాజిక బాధ్యత నిధులను జిల్లాలో మహిళల ఆత్మ గౌరవం, వైద్యం కొరకు కేటాయించడం అభినందనీయమని జిల్లాలో మహిళలకు ఉపయోగపడేలా ఈ నిధులతో గదులను, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ లను అందుబాటులో వచ్చేలా కృషి చేసిన సన్ చారిటబుల్ ట్రస్ట్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు... ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, సన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశోక్ ముస్తాపూరే, ఎఎ&ఎస్ట్రశ్రీ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ , ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధూలు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ సైబరాబాద్ దేవాలయానికి భూమిపూజ

**- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ**

**- ఇస్కాన్ దేవాలయ నిర్మాణంతో ఆధ్యాత్మిక సేవలు విస్తరిస్తాయి: కొండా సురేఖ**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 08:**

సైబరాబాద్ పరిధిలోని నలగండ్ల లో నిర్మించబోయే అతి పెద్ద ఇస్కాన్ దేవాలయ నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమం రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ చేతుల మీదుగా అంగరంగ వైభవంగా జరిగిందిడ ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు మంత్రి కొండా సురేఖకు ఘన స్వాగతం పలికారు..అర్చకులు వేద మంత్రాల నడుమ కొండా సురేఖ భూమిపూజ చేసారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇస్కాన్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మికత, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని భారతీయ సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడంలో వారిపాత్ర గొప్పదని కొనియాడారు..వారు కృష్ణతత్వాన్ని బోధించడంతో పాటుగా పేదవారికి ఆకలి తీర్చడం ఎంతో గొప్ప విషయమన్నారు.. ఈ దేవాలయ నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమంలో నేను పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. గత ప్రభుత్వంలో దేవాలయ నిర్మాణానికి సంబంధించిన భూమి కోసం కాళ్లు అరిగేలా తిరిగారని అయినా వారికి స్థలం కేటాయించలేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ఇస్కాన్ దేవాలయం నిర్మాణం కోసం 6000 గజాల భూమిని 22 సంవత్సరాల పాటు లీజ్‌పై కేటాయించినట్లు తెలిపారు. ఇస్కాన్ దేవాలయం నిర్మాణంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి సమాజానికి మేలు జరుగుతుందన్న విశ్వాసం ఉందన్నారు.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, నాయకులు జగదీశ్వర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ఇస్కాన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏ ఇంట్లో పుట్టినా మహిళలపై వివక్ష ఉంటుంది

**- పెద్దకులం, చిన్నకులమంటూ ఏదీ లేదని మహిళలందరిదీ ఒకే కులమని వ్యాఖ్య**

**- మహిళలను ప్రతిరోజూ గౌరవించాలన్న కవిత**

**- మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమం లేదన్న జాగృతి అధ్యక్షురాలు కవిత**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 08:**


పెద్దకులం, చిన్నకులమంటూ ఏదీ లేదని మహిళలందరిదీ ఒకే కులమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఏ ఇంట్లో పుట్టినా సరే వారిపై వివక్ష ఉంటుందని అన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. 'గివ్ హర్ స్పేస్' పేరిట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'స్టాండ్ విత్ హర్' కాదు, 'గివ్ హర్ స్పేస్' జాగృతి నినాదమని వెల్లడించారు. కేవలం మహిళా దినోత్సవం రోజే కాదని, ప్రతిరోజు మహిళని గౌరవించాలని ఆమె సూచించారు. మహిళను తండ్రి, భర్త, అన్న ఇలా అందరూ తక్కువగానే చూస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదని ఆమె పేర్కొన్నారు. సామాజిక తెలంగాణ సాధనలోనూ వారి పాత్ర కీలకమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలపై నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్ సాధనతో జాగృతి చరిత్ర సృష్టించిందని అన్నారు.

## న్యాయమా? ప్రతీకారమా? చట్టం ముసుగులో సాగుతున్న అదృశ్య యుద్ధం



డా .సూర్యదేవర రామకృష్ణ ,

9490754169



*మన సంస్కృతిలో న్యాయం అనే పదానికి ఒక పవిత్రమైన స్థానముంది. వేల సంవత్సరాల నాగరికత మనకు నేర్పిన పరమ సత్యం ఏమిటంటే నిజమైన న్యాయం ఎప్పుడూ చల్లగా, నిర్మలంగా, వ్యక్తిగత ద్వేషం లేని ఒక పవిత్ర ప్రక్రియగా ఉండాలి. కానీ నేటి సమాజంలో మనం చూస్తున్న దృశ్యం వేరుగా ఉంది. న్యాయం అనే రంగును ముఖానికి పూసుకుని, లోపల రగులుతున్న ప్రతీకారేచ్ఛను దాచుకుని అనేకమంది న్యాయస్థానాల మెట్లు ఎక్కుతున్నారు. చట్టాన్ని ఆయుధంగా మార్చుకుని, ఎదుటివారి జీవితాలను ధ్వంసం చేస్తున్నారు. ఇది ఈ తరం ఎదుర్కొంటున్న అత్యంత ప్రమాదకరమైన సామాజిక రుగ్మత. మొదట మనం న్యాయానికి, ప్రతీకారానికి మధ్య ఉన్న ఆ సన్నని గీతను అర్థం చేసుకోవాలి. న్యాయం అంటే ఇది సమాజ శ్రేయస్సు కోసం, నిష్పక్షపాతంగా జరిగే ప్రక్రియ. తప్పు చేసిన వాడు శిక్ష అనుభవించాలి, బాధితుడికి ఓదార్పు కలగాలి. ఇందులో వ్యక్తిగత కక్షలకు తావుండదు. ప్రతీకారం అనగా ఇది కేవలం ఒక వ్యక్తిని నాశనం చేయాలనే వికృత కోరిక. వాడు నన్ను దెబ్బతీశాడు, నేను వాడిని అంతం చేయాలి అనే అహంకారం నుండి ఇది పుడుతుంది. ప్రతీకారాన్ని నేరుగా తీర్చుకోవడం చట్టరీత్యా నేరం కాబట్టి, చాలామంది దాన్ని న్యాయం అనే ముసుగులో అమలు చేస్తున్నారు. ఎప్పుడైతే నాకు న్యాయం కావాలి అనే మాట వెనుక వాడు సర్వనాశనం అయిపోవాలి అనే ఉద్దేశం ఉంటుందో, అక్కడ న్యాయం చనిపోయి ప్రతీకారం పురుడుపోసుకుంటుంది*

భారతీయ న్యాయవ్యవస్థ ఎంతో ఉన్నతమైనది. కానీ నేడు కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, రాజకీయ విభేదాలు తీర్చుకోవడానికి మహిళలపై హింస కేసులు, ూజ/ూ అట్రాసిటీ చట్టాలు, మరియు పోక్సో (ూూజూూ) వంటి అత్యంత కఠినమైన చట్టాలను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. అభియోగం మోపడానికి ఒక్క నిమిషం చాలు, కానీ ఆ నింద నుండి బయటపడి నిరపరాధిత్వాన్ని నిరూపించుకోవడానికి దశాబ్దాలు పడుతోంది. ఈ కాలయాపన అనే బలహీనతనే కొందరు ప్రతీకార ఆయుధంగా వాడుకుంటున్నారు. సుప్రీంకోర్టు సైతం పలుమార్లు ఆందోళన వ్యక్తం చేస్తూ చట్టాన్ని వ్యక్తిగత అజెండాల కోసం వాడుకోవడం సమాజానికి గొడ్డలిపెట్టు అని హెచ్చరించింది. నేడు న్యాయం కోర్టు గదుల నుండి సోషల్ మీడియా వేదికలకు మారింది. ఒక్క ట్వీట్, ఒక్క వైరల్ వీడియో ఒక మనిషి జీవితాన్ని తలకిందులు చేయగలదు. నిందితుడు ఎవరో, బాధితుడు ఎవరో తేలకముందే హ్యాష్‌ట్యాగ్‌లతో తీర్పులు ఇచ్చేసే సంస్కృతి పెరిగిపోయింది. ఒక యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కథే దీనికి నిదర్శనం. ఒక తప్పుడు ఆరోపణ వల్ల సోషల్ మీడియాలో అతను రాక్షసుడిగా చిత్రించబడ్డాడు. కంపెనీ ఉద్యోగం తీసేసింది, స్నేహితులు దూరమయ్యారు, పెళ్లి సంబంధాలు చెడిపోయాయి. ఏడాది తర్వాత అతను నిర్దోషి అని కోర్టు చెప్పింది. కానీ ఆ కోల్పోయిన గౌరవాన్ని, కాలాన్ని ఏ కోర్టు తిరిగి ఇవ్వగలదు? ఇది న్యాయం కాదు, ఇది డిజిటల్ రూపంలో జరుగుతున్న మూకదాడి. రాజకీయాల్లో ఈ ధోరణి మరీ వికృతంగా ఉంది. ప్రభుత్వాలు మారగానే పాత పాలకులపై, అధికారులపై కేసులు పెట్టడం ఒక ఆనవాయితీగా మారింది. అవినీతిని శిక్షించడం ధర్మమే, కానీ ఆ విచారణ కేవలం ప్రత్యర్థులనే లక్ష్యంగా చేసుకున్నప్పుడు అది రాజకీయ ప్రతీకారం అవుతుంది. ఏది నిజమైన విచారణో, ఏది కక్ష సాధింపో అర్థం కాక సామాన్య పౌరుడు న్యాయవ్యవస్థపైనే నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది. మన ఇతిహాసాలు ఈ తేడాను స్పష్టంగా చెప్పాయి. మహాభారతంలో కృష్ణుడు పాండవులను యుద్ధానికి ప్రేరేపించింది ప్రతీకారం కోసం కాదు, ధర్మ స్థాపన కోసం. రామాయణంలో రాముడు రావణుడిని సంహరించింది తన భార్యను అపహరించాడన్న కోపంతో కాదు, లోకకంటకుడిని అంతం చేయాలనే లక్ష్యంతో. అందుకే రాముడు లంకను నాశనం చేయలేదు, కేవలం రావణుడిని మాత్రమే శిక్షించాడు. అదే న్యాయానికి, ప్రతీకారానికి ఉన్న తేడా. ఈ విషవలయాన్ని ఛేదించాలంటే కొన్ని కఠినమైన అడుగులు అవసరం,విచారణలు ఏళ్ల తరబడి సాగకుండా, నిర్ణీత కాలపరిమితిలో తీర్పులు రావాలి. అబద్ధపు ఆరోపణలతో ఒకరి జీవితాన్ని నాశనం చేసిన వారికి, బాధితుడికి జరిగిన నష్టానికి సమానమైన శిక్ష పడాలి. కోర్టు తీర్పు రాకముందే వ్యక్తుల వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయడాన్ని నేరంగా పరిగణించాలి. సమాజంగా మనం ఒక ఆరోపణ వినగానే స్పందించే ముందు వాస్తవాలను ఆరా తీసే ఓపిక పెంచుకోవాలి.

చివరగా ఒక్క మాట,ఎవరైనా మనకు హాని చేసినప్పుడు మన మనసులో మొదట పుట్టే ఆలోచన ఏమిటి? వాడు నాశనం అవ్వాలి అనా? లేదా నాకు జరిగిన అన్యాయం సరిదిద్దబడాలి అనా? మొదటిది ప్రతీకారం, రెండోది న్యాయం. ప్రతీకారం మీకు తాత్కాలిక సంతృప్తిని ఇవ్వచ్చు, కానీ అది మిమ్మల్ని కూడా ఆ పగ అనే అగ్నిలో దహించివేస్తుంది. న్యాయం కోసం పోరాడడం ప్రతి పౌరుడి హక్కు, బాధ్యత. కానీ ఆ పోరాటం న్యాయబద్ధంగా ఉండాలి. న్యాయం అనే పవిత్ర ఆసనంపై ప్రతీకారాన్ని కూర్చోబెడితే, చివరకు సమాజంలో మానవత్వం మిగలదు. న్యాయం కోసం పోరాడండి , కానీ ఆ పోరాటంలో మీరు న్యాయాన్ని మర్చిపోకండి!

## ప్రీ ప్రైమరీ తరగతులు అన్ని స్కూళ్లలో ప్రారంభించాలి



ఇంజమూరి రఘునందన్

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,

సెల్: 9866102962 బాలల హక్కుల

సంక్షేమ సంఘం (బిహెచ్ఎస్ఎస్)

**హైదరాబాద్ వెలుతురు మార్చి 08:**

మార్చి 20 వ తేదీన ప్రవేశపెట్టే తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఎం తైనా ఉందని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విద్యారంగంలో నిధుల కొరత కారణంగానే పాఠశాలల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. సమస్యల న్నింటికీ నిధుల కొరతే ప్రధాన కారణం అని అనేక సర్వేల్లో తేలింది. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తెలంగాణ రైజింగ్ నంబర్ 1 అన్నారు. కానీ విద్యారంగానికి కేటాయించే నిధుల(బడ్జెట్) విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అట్టడుగు స్థాయిలో ఉందనే విషయం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లో విద్యకు కేటాయిస్తున్న కేటాయింపులు చూస్తే తెలుస్తుంది. భారత దేశంలోనే వెనుకబడిన రాష్ట్రాలను ఆర్థికవేత్తలు బీమారు రాష్ట్రాలుగా పిలుస్తున్నటువంటి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం 13 శాతం, రాజస్థాన్ 18 శాతం, మధ్యప్రదేశ్ 16 శాతం, బీహార్ 18.4 శాతం విద్యారంగానికి తమ తమ రాష్ట్రాల బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్నవి. తెలంగాణ రాష్ట్రం మాత్రం 7.57 శాతం నిధులే కేటాయించింది. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత తక్కువ నిధులు కేటాయించడం లేదు. అదేవిధంగా దక్షిణాది రాష్ట్రాలతో పోల్చి చూసినా తమిళనాడు 13.4 శాతం, కేరళ 14.8 శాతం, కర్ణాటక 12.9 శాతం, చివరికి మనతో విడిపోయిన ప్రక్క రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్ లో కూడా 12 శాతం పైగా విద్యారంగానికి నిధులు కేటాయించడం జరుగుతుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన మొదటి సంవత్సరం 2014- 15 బడ్జెట్లో విద్యకు కేటాయింపులు 10.89 శాతం ఉండగా బిఆర్ఎస్ పదేండ్ల పాలనలో చివరి సంవత్సరంలో(2023- 24) నాటికి అది 6.5 శాతానికి పడిపోయింది. గత ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యారంగాన్ని గాడిలో పెడతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యకు బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయిస్తామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తాము అధికారం చేపట్టిన మొదటి సంవత్సరం 2024-25 లో 7.3 శాతం, రెండవ సంవత్సరం 2025-26 లో 7.57 శాతం మాత్రమే కేటాయించడం జరిగింది. ఈ సారైనా మార్చి 20 న ప్రవేశపెట్టే బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 20 శాతానికి తగ్గకుండా నిధులు కేటాయించాలని కోరుతున్నాము.

బడ్జెట్ లోటుతో రాష్ట్ర విద్యారంగం 12 ఏళ్లుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. వచ్చే విద్యా సంవత్సరంలోపు అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెరు గైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించుటకు చర్యలు చేపట్టాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది.

విద్యారంగానికి అతి తక్కువ బడ్జెట్ ఉండడం వల్లనే అవసరమైనన్ని గదులు లేని పాఠశాలలు 13,574 వరకు ఉండగా ఒక్కటే టాయిలెట్ ఉన్న పాఠశాలలు 21,507 ఉన్నాయి. పక్కా కాంపౌండ్ వాల్ లేనివి 13,868 ఉండగా కంప్యూటర్ ల్యాబ్ లు లేనివి 22,047 పాఠశాలలు ఉన్నాయి. దాదాపు 20 వేల స్కూళ్ళలో సగటున ఇద్దరే ఉపాధ్యాయులున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం తరగతి కి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. వేలాది పాఠశాలల్లో సైన్స్ టీచర్లు లేరు. లెక్కల టీచర్లు లేరు. భాషపండితులు లేరు. అంతే కాదు జిల్లాల్లో పాఠశాల విద్యా వ్యవస్థను పర్యవేక్షించాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారులు లేరు. సరైన మానిటరింగ్ వ్యవస్థలేని కారణంగా మరియు మౌళిక వసతుల లేమి కారణంగా గత రెండు సంవత్సరాలలో 4000 వరకు స్కూళ్లు మూతపడ్డాయి. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా బహిరంగంగా పాఠశాలలు రేషనలైజేషన్ చేసి మూసివేస్తామని ప్రకటించలేదు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా రేవంత్ రెడ్డి గారు బిఆర్ఎస్ పాలనలో మూతబడిన బడులను తిరిగి తెరుస్తామని పదే పదే అనేక సమావేశాల్లో ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మూతబడిన పాఠశాలలే వారి నిబద్ధతకు నిదర్శనంగానిలుస్తున్నవి. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 26 జిల్లాలకు పూర్తిస్థాయి జిల్లా విద్యాశాఖ అధికారులు(డిఇఓ) లేరు. ఇంచార్జ్ డిఇఓ లు, ఇంచార్జ్ ఎంఇఓ లతో రాష్ట్రంలో మానిటరింగ్ వ్యవస్థ కుప్పకూలి పోయింది. విద్యారంగానికి సంబంధం లేని అధికారుల(కలెక్టర్లకు)కు డిఇఓ లుగా అదనపు(ఎఫ్ఏసి) బాధ్యతలు అప్పగించడం జరుగుతుంది. ఇది హేతువిరుద్ధమైనది. జిల్లాలోని అన్ని డిపార్ట్మెంట్లను పర్యవేక్షణ చేయవలసిన జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ గారిని ఒక విద్యా విభాగానికి అధిపతిగా నియమించడం వారి స్థాయిని తగ్గించడమే అవుతుంది. సరైన పర్యవేక్షణ చేయలేని పరిస్థితి ఉంటుంది. డిప్యూటీ ఇఓ అయినా, డిఇఓ అయినా వారు తప్పనిసరిగా బిఇడి చేసి ఉండాలి. ఇది తప్పనిసరి. స్కూల్ ఎడ్యుకేషన్ తో సంబంధం లేని అధికారులకు డిఇఓ బాధ్యతలు అప్పగించకుండా చూడాలి.

అనేక ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్లు, వాచ్మెన్ లేరు. అనేక పాఠశాలల్లో టీవీ లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్పి) ప్యానెల్స్ తదితర విలువైన ఎలక్ట్రానిక్ వస్తు సామాగ్రి ఉన్నాయి. వాటికి సరైన రక్షణ లేదు. రాత్రి కాపలదారులు లేరు. అనేక పాఠశాలల్లో గంట కొట్టడానికి కార్యాలయ సహాయకుడు(అటెండర్) లేడు. ఒక పాఠశాల నడవాలంటే ఏమేమి ఉండాలో అవన్నీ కల్పిస్తేనే పాఠశాల సక్రమంగా నడుస్తుంది. అప్పుడే తల్లిదండ్రులకు నమ్మకం ఏర్పడుతుంది. ఇది మా బడి, మా పిల్లల బడి అని గర్వంగా చెప్పుకునేలా ప్రతి బడిని తీర్చి దిద్దాల్సిన అవసరం ఉంది.

ముఖ్యమంత్రి గారు పదే పదే అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేస్తామని క్రీడా పాలసీని రూపొందించారు. కానీ ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో క్రీడా సామర్థ్యాలు పెంపొందించుటకు తగు శిక్షణ ఇచ్చే క్రీడా ఉపాధ్యాయులు లేరు. కావున ప్రాథమిక స్థాయి పాఠశాలలకు కూడా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పిఇటి) పోస్టు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనకంటే రెండు సంవత్సరాల తర్వాత స్వాతంత్ర్యం పొందిన చైనా క్రీడా రంగంలో ప్రపంచంలోనే ఉన్నత స్థాయిలో ఉందన్న విషయం గమనించాలి. అక్కడి ప్రభుత్వం పాఠశాల స్థాయి నుండే క్రీడా రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత వల్లనే ఇది సాధ్యమైంది. కనుక ముఖ్యమంత్రి గారిని ప్రతి ప్రాథమిక పాఠశాలకు కూడా పిఇటి టీచర్ ను నియమించేలా చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ కోరారు.

అలాగే పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకతను గుర్తించి, అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ యాజమాన్యంలో పూర్వ ప్రాథమిక విద్య లేనికరణంగాననే తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రయివేట్ పాఠశాలల్లో ఎల్ కేజీ, యుకేజీ లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సౌకర్యము లేదు. ప్రభుత్వ యాజమాన్యంలో ఎన్రోల్మెంట్ తగ్గుదలకు ఇదొక కారణంగా ఉంది. తప్పనిసరిగా ప్రాథమిక విద్యను బలోపేతం చేయుటకు ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలని, అందుకు తగిన ఉపాధ్యాయులను,వసతులను సౌకర్యాలను కూడా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అదేవిధంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం విశ్వాసం కల్పించే విధంగా గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు బడి ఈడు పిల్లలందరూ బడుల్లో చేరే విధంగా విద్యా ఉద్యమాన్ని ప్రారంభించాలి. ముఖ్యమంత్రి మంత్రులు ఒక విధాన నిర్ణయం తీసుకుంటే తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించుటకు ముందుకు వస్తారు. ప్రయివేట్ బడుల్లో వేలు, లక్షల ఫీజుల భారం నుండు బయటపడతారు. ప్రభుత్వం చేయాల్సింది బడుల్లో మౌళిక వసతులు కల్పించి, పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఖాళీగా ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలి. బడుల్లో ప్రయోగశాలలు పనిచేసేలా చూడాలి. విద్యార్థులకు త్రాగునీరు మరియు టాయిలెట్స్ సక్రమమైన నిర్వహణకు రన్నింగ్ వాటర్ ఉండేలా చూడాలి. మధ్యాహ్న భోజనం(మిడ్డే మీల్) లో నాణ్యత పెంచాలి.

విద్యాశాఖను ముఖ్యమంత్రే స్వయంగా నిర్వహిస్తున్నందున ప్రత్యేక దృష్టి పెట్టి తెలంగాణలో విద్యారంగాన్ని దేశంలోనే ఉన్నతమైన స్థానంలో(తెలంగాణ రైజింగ్ నంబర్ 1 గా) నిలిపేందుకు విద్యారంగానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ కనీసం 20 శాతం తగ్గకుండా ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్) ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి చేస్తుంది.

# సంపాదకీయం..

# యుద్ధంలో మిగిలేది విజయగర్వం కాదు, శూన్యమే



యుద్ధం ప్రకటించేది ముసలివారు, కానీ పోరాడి చనిపోయేది మాత్రం యువకులే " .. రెండో ప్రపంచయుద్ధంలో అమెరికా అధ్యక్షుడుగా వ్యవహరించిన హెర్బర్ట్ హూవర్ చెప్పిన మాట. ఎందుకంటే యుద్ధం వినాశనాన్ని ఆయన కళ్లారా చూశారు మరి. ఇప్పుడు అదే అమెరికాకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ట్రంప్ దీన్ని నిజం చేస్తున్నారు. యుద్ధాలు చూసిన వారు .. యుద్ధాల్లో పాల్గొన్న వారు ఎవరైనా సరే చెప్పే మాట యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరనే. అయినా ఈ సూక్ష్మాన్ని అర్థం చేసుకునేంత విశాలమైన దృక్పథం లేని ట్రంప్ లాంటి నేతలే ప్రపంచాన్ని ఏలుతున్నారు. చరిత్ర పుటలను తిరగేస్తే కనిపించేది కేవలం రాజ్యాల విస్తరణో, వీరుల పరాక్రమమో కాదు.. ప్రతి యుద్ధం చివరన మిగిలిన శ్మశాన వైరాగ్యం. యుద్ధంలో విజేతలు ఉండరు.. కేవలం ప్రాణాలతో మిగిలిన వారు మాత్రమే ఉంటారు అన్నది జగమెరిగిన సత్యం. కానీ, దురదృష్టవశాత్తూ చరిత్ర నేర్పిన పాఠాలను విస్మరించడమే మానవజాతి అలవాటుగా మార్చుకుంది.ఖొమైనీని చంపేసినా విజయం దక్కలేదు చరిత్రలో యుద్ధాలు ఎప్పుడూ ఒక ముగింపును ఇవ్వలేదు, అవి కేవలం కొత్త అధ్యాయాలకు రక్తపాతంతో కూడిన ప్రారంభాలను మాత్రమే రాశాయి. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖొమైనీని లక్ష్యంగా చేసుకుని అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన నాయకత్వ నిర్మూలన ఆధునిక యుద్ధ తంత్రంలో ఒక సంచలనం కావచ్చు. కానీ, ఒక వ్యక్తిని లేదా ఒక వ్యవస్థ శిఖరాగ్రాన్ని తొలగించినంత మాత్రాన ఆ దేశంపై లేదా ఆ సిద్ధాంతంపై విజయం సాధించామనుకోవడం కేవలం భ్రమ మాత్రమేనని అనంతర పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఇరాన్ వంటి దేశాల్లో అధికారం అనేది కేవలం ఒక వ్యక్తిపై ఆధారపడి ఉండదు. దశాబ్దాలుగా అక్కడ నిర్మితమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, ఒక బలమైన మతపరమైన అధికార యంత్రాంగం, నాయకత్వం కోల్పోయినప్పుడు మరింత ఉధృతంగా స్పందిస్తాయి. ఇప్పుడు అదే జరుగుతోంది. ఫలితంగా గల్ఫ్ దేశాలు తమ ఎడారి వంటి వాతావరణంలో ఎంతో కష్టపడి నిర్మించుకుంటున్న ఆర్థిక వ్యవస్థకు ముప్పు ఏర్పడింది. శత్రువును నామరూపాలు లేకుండా చేయాలనే ఆకాంక్ష సిద్ధాంతపరంగా బాగుండవచ్చు కానీ, క్షేత్రస్థాయిలో అది అసాధ్యం. విత్తనాన్ని మట్టిలో పాతిపెడితే అది చనిపోదు, మరింత బలమైన వృక్షంగా మొలుస్తుంది. యుద్ధాల విషయంలో కూడా పగ, ప్రతీకారాలు అలాగే రూపాంతరం చెందుతాయి. ఖొమైనీ మరణం తర్వాత ఇరాన్ బలహీనపడిందని జరుగుతున్న పరిణామాలను చూసి ఎవరూ అనుకోవడంలేదు. ఒక కేంద్రీకృత నాయకత్వం లేనప్పుడు, ఆ వ్యవస్థలోని చిన్న చిన్న విభాగాలు స్వయంప్రతిపత్తితో విధ్వంసానికి తెగబడే ప్రమాదం ఉంది. ఇప్పుడు మనం చూస్తున్నట్లుగా, హోర్ముజ్ జలసంధి మూసివేత, అంతర్జాతీయ ఇంధన సరఫరాపై దాడులు, లెబనాన్ నుండి హిజ్బుల్లా ప్రయోగిస్తున్న క్షిపణులు.. ఇవన్నీ ఒక దేశాన్ని దెబ్బకొడితే ప్రపంచం మొత్తం ఎలా వణికిపోతుందో నిదర్శనాలు. విజేతగా నిలిచామని సంబరపడే లోపే, ఆర్థిక మాంద్యం , ప్రాంతీయ అస్థిరత అనే రూపాల్లో ఓటమి తలుపు తడుతోందని ఎప్పటికప్పుడు అనుభవమైన నిజం.యుద్ధంలో గెలిచిన వాడు కూడా ఓడిపోయిన వాడితో సమానమే, ఎందుకంటే ఇద్దరూ తమ ఆత్మీయులను కోల్పోతారు." అని శ్రీశ్రీమద్భాగవతంలో మనం చెప్పుకున్నాం. యుద్ధం ము గురించి చరిత్ర కేవలం గెలిచిన పక్షం పేరును మాత్రమే చెబుతుంది. కానీ ఆ గెలుపు కోసం చెల్లించిన మూల్యాన్ని ఎప్పుడూ విస్మరిస్తుంది. సరిహద్దుల మీద ఎగిరే జెండా ఆ దేశపు ఆత్మగౌరవానికి చిహ్నంగా కనిపించవచ్చు, కానీ ఆ జెండాను మోయాల్సిన యువతరం శ్మశానాల్లో కలిసిపోవడం ఏ విజయానికి సంకేతమనేది ఎవరు చెప్పగలరు? ఆధిపత్యం కోసం జరిగే ఈ పోరాటంలో అగ్రరాజ్యాలుగా వెలుగొందాలని చూసే దేశాలు, తమ భావి తరాల ఉనికినే పణంగా పెడుతున్నాయి. యుద్ధరంగంలో మిగిలేది విజయగర్వం కాదు, శూన్యం మాత్రమే. ఆర్థికంగా బలపడటం కోసం లేదా భూభాగాల కోసం చేసే యుద్ధాలు, ఒక దేశపు వెన్నెముకను విరిచేస్తాయి. యుద్ధం వల్ల కలిగే విధ్వంసం కేవలం భవనాలకూ, ఆస్తులకూ పరిమితం కాదు. అది ఒక దేశపు ఆర్థిక మూలాలను, సామాజిక సమతుల్యతను దశాబ్దాల పాటు కుంగదీస్తుంది. యుద్ధం కోసం వెచ్చించే వేల కోట్ల నిధులు మానవాభివృద్ధికి ఉపయోగపడాల్సినవి, కానీ అవి వినాశనానికి ఖర్చవుతున్నాయి. ఈ ప్రక్రియలో కోల్పోయిన మానవ వనరులు, మేధస్సు మళ్ళీ పునరుద్ధరించలేనివి. విజేతగా నిలిచిన దేశం కూడా పతనమైన ఆర్థిక వ్యవస్థతో, గాయపడిన సమాజంతోనే మనుగడ సాగించాల్సి వస్తుంది. ఇప్పుడు అమెరికా,ఇజ్రాయెల్‌లకు రేపు యుద్ధం చేయాలనుకునే మరో దేశానికీ అదే పరిస్థితి వస్తుంది. ఆధునిక కాలంలో యుద్ధం అనేది కేవలం సైనిక చర్య మాత్రమే కాదు, అది ఒక తరం మేధస్సును, సృజనాత్మకతను అణచివేసే చీకటి అధ్యాయం. యుద్ధం వల్ల కలిగే మానసిక గాయాలు, అస్థిరత సమాజంలో విద్వేష బీజాలను నాటుతాయి.మూడవ ప్రపంచ యుద్ధం ఏ ఆయుధాలతో జరుగుతుందో నాకు తెలియదు కానీ, నాలుగవ ప్రపంచ యుద్ధం మాత్రం రాళ్లు, రప్పలతో జరుగుతుంది.. ఐన్‌స్టీన్ చెప్పిన మాటను ఇప్పుడు ప్రపంచాన్ని శాసిస్తున్న నేతలు గుర్తు తెచ్చుకోవాలి. చరిత్ర పుటల్లో తమ పేరు శాశ్వతంగా నిలిచిపోవాలనే కొందరు పాలకుల వ్యక్తిగత అహంకారం, నేడు లక్షలాది మంది సామాన్యుల జీవితాలను బలిపీఠం ఎక్కిస్తోంది. యుద్ధాన్ని ఒక దౌత్యపరమైన సాధనంగా కాకుండా, తమ ఉనికిని చాటుకునే ప్రచార అస్త్రంగా మార్చుకోవడం అత్యంత ప్రమాదకరం. డొనాల్డ్ ట్రంప్ వంటి నేతలు కూడా యుద్ధాల వల్ల కలిగే అపారమైన ఆర్థిక నష్టాన్ని, వనరుల దుర్వినియోగాన్ని ప్రస్తావిస్తున్నారంటే, యుద్ధం అనేది కేవలం ప్రాణ నష్టమే కాదు, ఒక దేశపు ఆర్థిక మూలాలను దెబ్బతీసే అత్యంత ఖరీదైన వ్యర్థం అని స్పష్టమవుతోంది. భవిష్యత్తులో రాబోయే ఊహాజనిత ముప్పులను అడ్డుకోవా లనే భ్రమలో, వర్తమానంలో ఉన్న శాంతిని, స్థిరత్వాన్ని పణంగా పెట్టడం పాలకుల విజ్ఞతకు నిదర్శనం కాదు, అది వారి రాజకీయ బాధ్యతారాహిత్యమే అవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకుల ప్రథమ కర్తవ్యం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, కానీ క్షిపణుల ప్రయోగాలే పరాక్రమంగా భావిస్తున్నారు. వివేకవంతులైన పాలకులు యుద్ధాన్ని నివారించడంలోనే తమ గొప్పతనాన్ని వెతుక్కోవాలి తప్ప, యుద్ధాన్ని సృష్టించడంలో కాదు.యుద్ధాన్ని అంతం చేయకపోతే యుద్ధమే మనల్ని అంతం చేస్తుంది !ఆధునిక ప్రపంచంలో పాలకులకు కావాల్సింది యుద్ధ క్షేత్రంలో ప్రదర్శించే పరాక్రమం కాదు, చర్చల విషయంలో ప్రదర్శించే దౌత్యనీతి. చరిత్రను అధ్యయనం చేయడం అంటే కేవలం గతంలో జరిగిన యుద్ధాల విజయగాథలను నెమరువేసుకోవడం కాదు.. ఆ ఘర్షణలు మిగిల్చిన రక్తపాతాన్ని, విధ్వంసాన్ని గుర్తించి, అటువంటి తప్పులు మళ్ళీ జరగకుండా చూడటం. శాంతిని కోరుకోవడం అంటే చేతకానితనం కాదు, అది ఒక పరిణతి చెందిన నాగరికతకు, అత్యంత శక్తివంతమైన నాయకత్వానికి నిదర్శనం. క్షిపణుల గర్జనల కంటే చర్చల ద్వారా లభించే పరిష్కారాలే సుస్థిరమైన భవిష్యత్తుకు బాటలు వేస్తాయి. ఈ సత్యాన్ని పాలకులు విస్మరిస్తే, వారు చరిత్రలో నిర్మాతలుగా కాకుండా విధ్వంసకారులుగా మిగిలిపోతారు. రేపటి తరం మన నుండి ఆశించేది కేవలం సాంకేతిక విప్లవం ,ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు, సురక్షితమైన , ప్రశాంతమైన జీవన వాతావరణాన్ని కూడా. పాలకుల స్వార్థపూరిత నిర్ణయాలు, బాధ్యతారాహిత్యం వల్ల భూగోళం శిథిలమైతే, ఆ వినాశనానికి ఏ సిద్ధాంతం కూడా ప్రాయశ్చిత్తం చేయలేదు. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు ఆయుధ పోటీని వీడి, మానవీయ విలువలపై దృష్టి సారించాలి. శాంతియుత సహజీవనం మాత్రమే ఈ గ్లోబల్ విలేజ్ ను కాపాడగల ఏకైక మార్గం. యుద్ధం గెలిస్తే దేశం గెలవొచ్చు, కానీ శాంతి గెలిస్తేనే మానవత్వం గెలుస్తుంది.

# ఈ దేశానికి వారసత్వ గాంధీ కుటుంబం అవసరమా...?



**మన్నారం నాగరాజు**

సామాజిక రాజకీయ విశ్లేషకులు.

*భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పటి నుండి దాదాపు 78 సంవత్సరాలు గడిచాయి. స్వాతంత్ర్యం అనే అమూల్యమైన వరం కోసం అనేక తరాలు పోరాడాయి. ఆ పోరాట ఫలితంగా 1947లో భారతదేశం సర్వసత్తాక సార్వభౌమ దేశంగా ఆవిర్భవించింది. నేడు దేశం "అమృతకాలం" వైపు సాగుతున్నదని చెప్పుకుంటూ దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యోత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నాం. అయితే ఈ వేడుకల మధ్యలో ఒక ప్రశ్న మన ముందుకు వస్తోంది ఈ 78 సంవత్సరాల్లో దేశం ఎంత ముందుకు వెళ్లింది? ప్రజల ఆశలు, ఆకాంక్షలు ఎంతవరకు నెరవేరాయి? ముఖ్యంగా రాజకీయ నాయకత్వం విషయంలో దేశం నిజంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు సాగుతున్నదా? లేక కొన్ని కుటుంబాల చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయా? అన్న సందేహాలు కూడా సహజంగానే ఉత్పన్నమవుతున్నాయి.*

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశలో భారత రాజకీయాలలో ఉన్న నాయకత్వం అసాధారణమైనది. దేశ నిర్మాణంలో భాగంగా పనిచేసిన నాయకులు దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకున్నారు. ఆ కాలంలో ఉన్న నాయకత్వం గురించి మాట్లాడేటప్పుడు మనకు గుర్తొచ్చే మహనీయులు అనేకమంది. వారిలో ముఖ్యంగా మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, బి. ఆర్. అంబేద్కర్, సర్వేపల్లి రాధాకృష్ణన్, రాజేంద్ర ప్రసాద్, లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహనీయులను ప్రస్తావించకుండా ఉండలేము. వీరంతా రాజకీయాలను వ్యక్తిగత స్వార్థాల కోసం కాకుండా దేశ ప్రయోజనాల కోసం ఉపయోగించిన నేతలు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలపరచడంలో వీరి పాత్ర అపారమైనది. అయితే కాలం మారినకొద్దీ రాజకీయాల స్వభావం కూడా మారిపోయింది. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో రాజకీయాలు క్రమంగా కుటుంబాధిపత్యం వైపు మళ్లినట్టు విమర్శలు వినిపించాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే గాంధీ కుటుంబం చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయన్న విమర్శలు గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో "దేశానికి గాంధీ కుటుంబం అవసరమా?" అన్న ప్రశ్న ఒక రాజకీయ చర్చగా మారింది. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన రాజకీయ శక్తిగా ఎదిగింది. ఆ పార్టీ ద్వారా దేశానికి పలు ప్రధాన మంత్రులు లభించారు. అయితే కాంగ్రెస్ పార్టీ నాయకత్వం క్రమంగా ఒక కుటుంబానికి పరిమితమైందన్న అభిప్రాయం బలపడింది. ఇందిరాగాంధీ కాలంలో ఈ కుటుంబ ఆధిపత్యం మరింత బలపడింది. తర్వాత రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మరణం తర్వాత సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీని దీర్ఘకాలం నడిపించారు. ప్రస్తుతం ఆ కుటుంబానికి చెందిన రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నాయకత్వం వారసత్వంగా రావడం సరైనదా అనే ప్రశ్న చాలా కాలంగా చర్చకు వస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులను ఎన్నుకోవాలి. ఒక కుటుంబానికి మాత్రమే అధికారం కేంద్రీకృతమవుతుంటే అది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమనే అభిప్రాయం చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో గాంధీ కుటుంబం దేశ రాజకీయాలలో చేసిన సేవలను కూడా కొందరు గుర్తు చేస్తుంటారు.ఴభారత రాజకీయాల్లో మరో ముఖ్య అంశం జాతీయ పార్టీల పాత్ర. కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలు దేశ రాజకీయాలను దశాబ్దాలుగా ప్రభావితం చేస్తున్నాయి. అయితే సామాజిక న్యాయం, ప్రాంతీయ అభివృద్ధి వంటి అంశాలలో ఈ పార్టీలు ఎంతవరకు న్యాయం చేశాయన్న ప్రశ్న కూడా తరచుగా లేవనెత్తబడుతోంది. ముఖ్యంగా వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీల సమస్యల విషయంలో ఈ రెండు ప్రధాన జాతీయ పార్టీలు సరైన ప్రాధాన్యం ఇవ్వలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంతీయ పార్టీల ప్రభావం దేశంలో పెరిగింది. రాష్ట్రాల ప్రత్యేక అవసరాలు, ప్రాంతీయ సమస్యలను ముందుకు తెచ్చే ప్రయత్నం ప్రాంతీయ పార్టీలు చేశాయి. తెలంగాణలో ఉదాహరణకు కాంగ్రెస్, బీజేపీతో పాటు ప్రాంతీయ రాజకీయ శక్తులు కూడా ప్రభావం చూపుతున్నాయి. తెలంగాణ రాజకీయాల సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా ఇటీవల పెద్ద చర్చకు దారితీశాయి. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తలచుకుంటే పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చగలమని ఆయన చెప్పిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వివాదాస్పదమయ్యాయి. ఇదే సమయంలో గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ఇప్పుడు మళ్లీ చర్చకు వస్తున్నాయి. తెలంగాణ రాజకీయాలలో గతంలో ఆయన తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు రాహుల్ గాంధీ పై తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియాలో బీజేపీ నాయకులు రాహుల్ గాంధీని "పప్పు" అని విమర్శించినప్పుడు, అదే వ్యాఖ్యలను రేవంత్ రెడ్డి కూడా చేసినట్టు అప్పటి రాజకీయ చర్చల్లో వినిపించింది. అయితే కాలం మారింది. రాజకీయ పరిస్థితులు కూడా మారాయి. ఇప్పుడు అదే నాయకుడు కాంగ్రెస్ పార్టీలో చేరి ముఖ్యమంత్రి అయ్యాడు. ఇదే సమయంలో రాహుల్ గాంధీకి ప్రధానమంత్రి పదవి రావాలని ఆయన కోరుతున్నట్టు చెప్పడం రాజకీయ వ్యూహంగా భావించబడుతోంది. రాజకీయాల్లో ఈ విధమైన మార్పులు కొత్తవి కావు. రాజకీయాలు చాలా సార్లు పరిస్థితులకు అనుగుణంగా మారుతుంటాయి. అయితే ప్రజల దృష్టిలో ఈ మార్పులు కొన్నిసార్లు సందేహాలను కలిగిస్తాయి. రాజకీయ నాయకులు గతంలో చెప్పిన మాటలు, ప్రస్తుతం చేస్తున్న చర్యలు ఒకదానికొకటి విరుద్ధంగా కనిపిస్తే ప్రజల్లో అవిశ్వాసం పెరుగుతుంది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 99 స్థానాలు గెలుచుకోవడం పార్టీకి కొంత ఊరటనిచ్చింది. అయితే అది పూర్తి విజయం కాదు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఇంకా బలహీనతలు ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు చాలా తక్కువ. ముఖ్యంగా కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో మాత్రమే ఆ పార్టీ అధికారంలో ఉంది. ఇది కాంగ్రెస్ పార్టీకి ఒక హెచ్చరికగా కూడా భావించవచ్చు. ఒకప్పుడు దేశ రాజకీయాలను ఆధిపత్యంగా నడిపించిన పార్టీ ఇప్పుడు చాలా రాష్ట్రాల్లో బలహీనంగా మారింది. ఈ పరిస్థితికి కారణాలపై పార్టీ లోపల కూడా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. ఇదే సమయంలో మైనారిటీ ఓట్ల రాజకీయాలు కూడా దేశ రాజకీయాలలో కీలక అంశంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో మైనారిటీ ఓట్లు ఇతర పార్టీలకు మళ్లడం కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారుతోంది. మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో మైనారిటీ ఓట్లు కొత్త పార్టీలకు వెళ్లినట్టు విశ్లేషణలు చెబుతున్నాయి. ప్రజలకు ఇచ్చిన హామీలు కూడా రాజకీయాల్లో కీలకమైన అంశం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు విషయంలో కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. నిరుద్యోగ సమస్య కూడా తెలంగాణలో ప్రధాన సమస్యగా మారింది. ఎన్నికల ముందు నిరుద్యోగులతో సమావేశాలు నిర్వహించి వారికి హామీలు ఇచ్చిన నాయకులు ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలు విషయంలో ఎంతవరకు కృషి చేస్తున్నారు అన్నది ప్రజలు గమనిస్తున్నారు. హైదరాబాద్‌లోని అశోక్ నగర్ ప్రాంతం నిరుద్యోగుల ఉద్యమాలకు కేంద్రంగా మారింది. అక్కడ జరిగిన సమావేశాల్లో నాయకులు ఇచ్చిన హామీలు ఇప్పుడు ప్రజలకు గుర్తు వస్తున్నాయి. కానీ ప్రస్తుతం అక్కడ ఆంక్షలు విధించడం వంటి పరిణామాలు ప్రజల్లో సందేహాలు కలిగిస్తున్నాయి. అదే విధంగా పేదల ఇండ్ల కూల్చివేత వంటి ఘటనలు కూడా ప్రభుత్వంపై విమర్శలకు కారణమవుతున్నాయి. ఖమ్మం ప్రాంతంలో జరిగిన ఇండ్ల కూల్చివేతలు రాజకీయ చర్చకు దారితీశాయి. ఒకవైపు సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి గురించి మాట్లాడుతున్న నాయకులు మరోవైపు పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో నైతిక విలువలు కూడా చాలా ముఖ్యమైనవి. ఒకప్పుడు అవినీతిపరుల్ని సమాజం తిరస్కరించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులు కూడా ఎన్నికల్లో గెలుస్తున్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు ఒక హెచ్చరికగా భావించాలి. ప్రజాస్వామ్యంలో అసలు శక్తి ప్రజలదే. ప్రజలు ఎవ్వరిని ఎన్నుకుంటే వారు పాలకులవుతారు. అందువల్ల ప్రజలు బాధ్యతాయుతంగా నిర్ణయం తీసుకోవాలి. నాయకుల వ్యక్తిత్వం, నిబద్ధత, నిజాయితీ వంటి అంశాలను పరిశీలించి ఓటు వేయాలి. దేశ రాజకీయాల్లో కుటుంబాధిపత్యం కొనసాగాలా లేక కొత్త నాయకత్వానికి అవకాశాలు ఇవ్వాలా అన్నది కూడా ప్రజలే నిర్ణయించాలి. ప్రజాస్వామ్యంలో ఎవరికీ శాశ్వత అధికారం ఉండదు. ప్రజలు కోరితేనే నాయకులు అధికారంలో ఉంటారు. ఈ నేపథ్యంలో "దేశానికి గాంధీ కుటుంబం అవసరమా?" అన్న ప్రశ్నకు సమాధానం కూడా ప్రజల చేతుల్లోనే ఉంది. ఒక కుటుంబం నాయకత్వం వహించడం తప్పు అని చెప్పడం సులభం. కానీ అదే సమయంలో ఆ కుటుంబానికి ప్రజల మద్దతు ఉంటే వారు రాజకీయాల్లో కొనసాగడం సహజం. కాబట్టి అసలు ప్రశ్న గాంధీ కుటుంబం గురించి కాదు. ప్రజాస్వామ్యం ఎలా పనిచేస్తోంది అన్నదే ముఖ్యమైనది. ప్రజలు తమ ఓటు ద్వారా సరైన నాయకత్వాన్ని ఎన్నుకుంటే దేశ భవిష్యత్తు బలంగా ఉంటుంది. దేశ రాజకీయాల్లో నైతికత, పారదర్శకత, ప్రజా సేవ భావన పెరిగితేనే నిజమైన ప్రజాస్వామ్యం బలపడుతుంది. వ్యక్తులు కాదు వ్యవస్థలు బలపడాలి. కుటుంబాలు కాదు సిద్ధాంతాలు ముందుకు రావాలి. అదే నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది.చివరగా చెప్పాలంటే భారతదేశానికి అవసరమైంది ఒక కుటుంబం కాదు. అవసరమైంది నిబద్ధత కలిగిన నాయకత్వం. ప్రజల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరించే రాజకీయ సంస్కృతి. అవినీతి రహిత పరిపాలన. సామాజిక న్యాయం. సమగ్ర అభివృద్ధి.అప్పుడు మాత్రమే స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల ఆశయాలు నిజంగా సార్థకమవుతాయి. అప్పుడే భారతదేశం ప్రపంచంలో తలెత్తుకొని నిలబడగలదు.

## డబుల్ బెడ్రూమ్ కాలనీలో సమస్యలపై ఆరా

**- మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఘన సత్కారం**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోచారం డివిజన్ ప్రతాప్ సింగారం డబుల్ బెడ్రూమ్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఈరోజు మేడ్చల్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మేడ్చల్ రూరల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు కప్పరగళ్ళ కరుణాకర్ తో కలిసి కాలనీలో పర్యటించి అక్కడి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను ఆరా తీశారు. కాలనీలో తాగునీటి సమస్యలు, స్ట్రీట్ లైట్స్, రాత్రిపూట గంజాయి బ్యాచ్, మద్యం సేవించే వారితో మహిళలకు భద్రత లోపం మరియు ఇతర మౌలిక వసతుల లోపాలపై కాలనీవాసులు తమ ఇబ్బందులను వివరించగా, వాటిని శ్రద్ధగా విన్న ఏనుగు సుదర్శన్ రెడ్డి వెంటనే స్పందించారు. సమస్యలపై వాటర్ డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులకు మరియు స్థానిక డిప్యూటీ కమిషనర్ శ్రీవాణికి, ఏసిపి చక్రపాణికి పూర్తి వివరాలు తెలియజేసి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాలనీలోని మహిళలను శాలువాలతో ఘనంగా సత్కరించి వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, ప్రతి కుటుంబానికి మహిళలే బలమని ఆయన పేర్కొన్నారు.

## విశాఖలో రెస్టారెంట్లపై ఐటీ అధికారుల దాడులు

**హైదరాబాద్, మార్చి 8 ( వెలుతురు):**
విశాఖలోని సెలబ్రేషన్స్ రెస్టారెంట్లపై ఐటీ అధికారులు ఆదివారం ఏకకాలంలో నాలుగు చోట్ల దాడులు చేశారు. పెందుర్తితోపాటు అక్షయపాలెం, మధురవాడలోని బ్రాంచీల్లోనూ సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో రెస్టారెంట్లల్లో జోరుగా అమ్మకాలు జరుపుతున్న నిర్వాహకులు, రికార్డులను తొలగించినట్టు తెలుసుకున్నారు. కస్టమర్లు ఆన్‌లైన్ పేమెంట్ల ద్వారా చెల్లించిన డబ్బులతోపాటు నేరుగా చెల్లించిన నగదు చెల్లింపుల్లో లోపాలున్నట్టు గుర్తించారు. జీఎస్టీ, ఐటీ పన్ను సైతం ఎగవేసినట్టు ఆధారాలు సేకరించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ డాటాతో పాటు పలు రికార్డులను తనిఖీలు చేశారు.

## రియల్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం ప్రాపర్టీ పల్స్ న్యూస్ పేపర్ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు మార్చి 08:**
ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మకమైన నిర్ణయాల వల్ల రియల్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతోందని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అదివారం సచివాలయంలో ఆయన ప్రాపర్టీ పల్స్ అనే ఆంగ్ల రియల్ ఎస్టేట్ వీక్లీ న్యూస్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లను ఆకర్షించడంలో హైదరాబాద్ మిగతా నగరాల కంటే ముందంజలో ఉందన్నారు. తెలంగాణ నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వ సరికొత్త నిర్ణయాల్ని తీసుకుంటుందని తెలిపారు. ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్ కు అంతర్జాతీయ ఖ్యాతినార్జించిందని.. అనేక దేశ, విదేశీ సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడుల్ని పెట్టేందుకు ముందుకొస్తున్నాయని అన్నారు. నగరానికే తలమానికమైన మెట్రో సెకండ్ ఫేజ్, రతన్ టాటా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వంటివి అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి రియల్ ఎస్టేట్ వీక్లీ పేపర్ హైదరాబాద్ నుంచి ఆరంభం కావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రాపర్టీ పల్స్ ఎడిటర్ కింగ్ జాన్సన్ కొయ్యడకి శుభాకాంక్షలు తెలిపారు. ఎడిటర్ కార్యక్రమంలో పట్లోళ్ల కిరణ్, గొట్టేటి రాజేష్, ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరీ చిలుకూరి హరిప్రసాద్, ఈసీ సభ్యులు అమిత్ బట్టు, వనం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గాధగొని కొండయ్య శ్రీలత గార్ల కుమారుడు భగత్ ఎంగేజ్మెంట్ ఫంక్షన్ లో పాల్గొన్న ప్రముఖులు



**హైదరాబాద్ వెలుతురు మార్చి 08:**
గాధగొని కొండయ్య శ్రీలత గార్ల కుమారుడు భగత్ ఎంగేజ్మెంట్ ఫంక్షన్ కినేరా గ్రాండ్ వనస్థలిపురం లో ఘనంగా జరిగింది.. పలువురు ప్రముఖులు హాజరయ్యారు.. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, నక్రెకల్ ఏమ్మెల్యే వేముల వీరేశం, ప్రజా వాగ్గేయ కారులు ఎంఎల్సీ గోరేటి వెంకన్న, ఆర్అండ్ బీ ఇన్ఫ్రాక్చర్ చైర్మన్ మాల్రెడ్డి రామ్ రెడ్డి, గ్రంథాలయ రాష్ట్ర చైర్మన్ రియాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్ , ప్రముఖ విద్యావేత్త ఎస్ రాజు, ఎల్బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య, ప్రముఖ డాక్టర్ మంచుకొండ రంగయ్య తదితరులు పాల్గొన్నారు..

## మహిళా దినోత్సవం సందర్భంగా కొత్తపేటలో ఘనంగా శ్రీదేవి హెర్బల్ స్టోర్ ప్రారంభోత్సవం






**కొత్తపేట వెలుతురు మార్చి 08:**
ఆయుర్వేదం మరియు ప్రకృతి ప్రసాదించిన మూలికల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం మరియు సౌందర్యాన్ని అందించే లక్ష్యంతో "శ్రీదేవి హెర్బల్ & కో" కొత్తపేటలో ఆదివారం తమ స్టోర్ ను కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా ప్రారంభించి వినూత్న ఉత్పత్తులను మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చింది. కెమికల్ రహిత ఉత్పత్తుల పట్ల పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని, శిశువుల నుండి పెద్దల వరకు అందరికీ ఉపయోగపడే 100కు పైగా ఉత్పత్తులను ఈ సంస్థ అందిస్తోంది. ఈ సందర్భంగా నిర్వాహకురాలు వేముల శ్రీదేవి మాట్లాడుతూ.. తమ స్టోర్ లో స్కిన్ కేర్, హెయిర్ కేర్, హెల్త్ కేర్, బేబీ కేర్ కు సంబంధించి పలు ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇక్కడ లభించే అన్ని ఉత్పత్తులు ఆయుష్, జీఎంపీ, ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ మరియు ఎంఎస్ఎంఈ ద్వారా ధృవీకరించబడ్డాయని ఆమె తెలిపారు. సంస్థ నిర్వాహకురాలు వేముల శ్రీదేవి ఆయుర్వేదం మరియు నేచురోపతిలో డిప్లొమా కలిగి ఉన్నారు. వారి విశేష సేవలకు గాను గవర్నర్ నుండి "నేషనల్ అవార్డ్" మరియు పలు ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకున్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా 3000 రూపాయల కొనుగోలుపై ఒక సిల్వర్ కాయిన్ ఉచితంగా ఇస్తున్నామని ఆమె తెలిపారు. కొత్తపేట, పరిసర ప్రాంతాల ప్రజలు ఒకసారి తమ స్టోర్ను సందర్శించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకురాలు శ్రీదేవి కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ శైలజ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సిబ్బంది, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 1.74కోట్ల రూపాయల కార్పొరేట్ సంస్థల సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో బేబీ ఫీడింగ్ రూమ్స్, యూనిట్ ల అందజేత...





**ఆదిలాబాద్ వెలుతురు మార్చి 08:**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోల్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో జూ= (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో 25 బేబీ ఫీడింగ్ రూమ్ లను ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది...స్త్రీల ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇస్తూ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు... అదే విధంగా కార్పొరేషన్ జూ= నిధులతో 1.74 కోట్ల రూపాయల సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ తో ఈ సామాజిక కార్యక్రమాలను చేపట్టారు.. ఎంపీ గోడం నగేష్ చొరవతో ఈ నిధులకు జిల్లాకు కేటాయించబడ్డాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు సంబంధించిన సామాజిక బాధ్యత నిధులను జిల్లాలో మహిళల ఆత్మ గౌరవం, వైద్యం కొరకు కేటాయించడం అభినందనీయమని జిల్లాలో మహిళలకు ఉపయోగపడేలా ఈ నిధులతో బేబీ ఫీడింగ్ గదులను, యూనిట్ లను అందుబాటులో వచ్చేలా కృషి చేసిన సన్ చారిటబుల్ ట్రస్ట్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు... ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, సన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశోక్ ముస్తాపూరే,dm&dho నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ , ప్రతినిధూలు తదితరులు పాల్గొన్నారు..

# బాలికల ఆరోగ్య రక్షణ కొరకు టీకా



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లో బాలికల ఆరోగ్య రక్షణకు కీలకమైన హెచ్ పి వి (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా కార్యక్రమాన్ని ఈరోజు మల్కాజ్గిరి ఏరియా హాస్పిటల్లో ఘనంగా మల్కాజ్గిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, బాలికలలో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడానికి హెచ్ పి వి టీకా అత్యంత ప్రభావవంతమైనదని తెలిపారు. 14 సంవత్సరాల బాలికలు తప్పనిసరిగా ఈ టీకాను వేయించుకోవాలని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ పిల్లలను సమీప ఆరోగ్య కేంద్రాలకు తీసుకురావాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా డా. సి. ఉమా గౌరి మాట్లాడుతూ హెచ్ పి వి టీకా కార్యక్రమం డి ఎమ్ ఈ మరియు టీవీవీపీ ఆధ్వర్యంలోని వైద్య సంస్థలలో మాత్రమే నిర్వహించబడుతుందని, ప్రతి పని దినంలో ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు టీకా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ టీకా సేవలు జి జి హెచ్ కుత్బుల్లాపూర్ / ఏరియా హాస్పిటల్ మల్కాజ్గిరి, సీహెచ్‌సీ మెడ్చల్ మరియు సీహెచ్‌సీ ఘట్‌కేసర్ కేంద్రాలలో అందుబాటులో ఉంటాయి. 07-03-2011 నుండి 08-03-2012 మధ్య జన్మించిన 14 సంవత్సరాల బాలికలు మాత్రమే ఈ టీకా కార్యక్రమానికి అర్హులని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. వి. కౌశిక్ మాట్లాడుతూ, ఈరోజు మొత్తం 72 మంది బాలికలకు హెచ్ పి వి టీకా ఇవ్వబడిందని తెలిపారు. అందులో జి జి హెచ్ కుత్బుల్లాపూర్ / ఏరియా హాస్పిటల్ మల్కాజ్గిరి వద్ద 42 మంది, సీహెచ్‌సీ మెడ్చల్ వద్ద 20 మంది, సీహెచ్‌సీ ఘట్‌కేసర్ వద్ద 10 మంది బాలికలు టీకా పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్కాజ్గిరి డివిజన్ డా. ఎం. లావణ్య, ప్రోగ్రాం ఆఫీసర్ సి హెచ్ ఐ డా. వి. కౌశిక్ , జి జి హెచ్ కుత్బుల్లాపూర్ సూపరింటెండెంట్ డా. జి. రాధ, సిఎస్ ఆర్ఎంఓ డా. సాయి శోభ, డిసిఎస్ ఆర్ఎంఓ డా. పల్లవి , పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డా. రాధ కిషన్, ఏరియా హాస్పిటల్ మల్కాజ్గిరి డి సి హెచ్ ఎస్ డా. సునీత , సీహెచ్‌సీ షామీర్‌పేట్ సూపరింటెండెంట్ డా. శివ కిరణ్, పిహెచ్‌సీ మల్కాజ్గిరి మెడికల్ ఆఫీసర్లు డా. సుష్మ, డా. మధురి, యూపిహెచ్‌సీ ఏకలవ్యనగర్ మెడికల్ ఆఫీసర్ డా. రాధ పాల్గొన్నారు. అలాగే ఆశా, ఏఎన్ఎమ్ మరియు సూపర్వైజర్లు తమ పరిధిలో ఉన్న అర్హులైన బాలికలను గుర్తించి సమీప టీకా కేంద్రాలకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు.

## తిరుమలగిరి పల్లవి మోడల్ స్కూల్‌లో ఘనంగా ప్రీ-ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే







**తిరుమలగిరి వెలుతురు మార్చి 08:**
స్థానిక పల్లవి మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ప్రీ-ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు గ్రాడ్యుయేషన్ గౌన్లు, టోపీలు ధరించి వేదికపై మెరిసిపోవడంతో పాఠశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది. చిన్నారి అడుగులు విద్యా ప్రపంచంలో కొత్త దశలోకి అడుగుపెడుతున్న ఈ వేడుక తల్లిదండ్రులకు ప్రత్యేక ఆనందాన్ని పంచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ విద్యావేత్త, పరిశోధకురాలు సూర్య స్వప్న మాట్లాడుతూ విద్య అనేది కేవలం అక్షరజ్ఞానానికే పరిమితం కాకుండా సంస్కృతి, విలువలను అర్థం చేసుకునేలా ఉండాలని అన్నారు. విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞాశాలులుగా ఎదిగి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ఈ రోజు పట్టాలు అందుకుంటున్న చిన్నారులే రేపటి సమాజానికి వెలుగునిచ్చే దీపాలని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని సంపూర్ణ వ్యక్తిత్వంతో తీర్చిదిద్దేందుకు పాఠశాల ఎప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. చిన్నారుల ఎదుగుదలలో భాగస్వాములైన తల్లిదండ్రులను అభినందించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సాగర్ మాట్లాడుతూ యూకేజీ పూర్తి చేసుకుని ప్రాథమిక విద్యలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి చిన్నారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు వేదికపై ధైర్యంగా మాట్లాడి తమ పాఠశాల అనుభవాలను పంచుకోవడం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమం ముగింపులో విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేసి అభినందించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో జరిగిన ఈ వేడుక విద్యార్థుల భవిష్యత్తుకు నాంది పలికింది.



కరీంనగర్ నగరంలో 45 వ డివిజన్ లో మహిళా దినోత్సవం సందర్భంగా రాజీవ్ పార్క్ లో వెంకటేశ్వర కాలనీ వాసుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ హాజరయ్యారు.
**కరీంనగర్ వెలుతురు మార్చి 08:**

## పోలీసులపై దౌర్జన్యం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్):**
జోహార్ నగర్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో అర్ధరాత్రి ప్యాడ్ బ్యాండ్, డీజే సౌండ్లకు సంబంధించి సాయికుమార్, చాకలి వెంకటేశంల నుండి 100 డయల్ ద్వారా శబ్ద కాలుష్యంపై సమాచారం అందుకున్న పోలీసులు, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ నుండి ఆలేజి మల్లేష్ పి సి నెంబర్ 12982 పెట్రోల్ వెహికల్ ఇన్చార్జిగా, డ్రైవర్ శ్రీను హెచ్ జి 421 శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో అక్కడకు చేరుకొని యా 08ఖా1565 నెంబర్ గల అశోక లేలాండ్ వాహనంలో గల డీజే శబ్దాలను నిలిపివేశారు. అక్కడే ఉన్న డి సందీప్ అనే వ్యక్తి పోలీసులను తోసేసి, వారి విధులకు ఆటంకం కలిగించి, దుర్భషలాడి ఆ వాహనాన్ని పంపించి వేశాడు. మళ్లీ తెల్లవారుజామున ఒంటిగంట ఆ సమయంలో మళ్లీ శబ్ద కాలుష్యం పై చాకలి వెంకటేశం ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే పెట్రోల్ కార్ సిబ్బంది, నైట్ డ్యూటీ ఆఫీసర్ నర్సిరెడ్డి, బ్లూ కోల్ట్ వాహన సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు పెద్ద పెద్ద శబ్దాలతో గందరగోళం సృష్టిస్తూ సందీప్, పవన్ మరియు విశాల్, అతని సహచరులు స్థానికులం అని చెప్పుకుంటూ, పోలీసులను అసభ్య పదజాలంతో దూషిస్తూ, విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మల్లేష్ చొక్కా కాలర్ పట్టుకుని హంగామా సృష్టించారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై వారిని పట్టుకుని విచారించి, అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం జరిగింది.

# హెచ్ సీఏలో పైరవీలు, డబ్బులు తీసుకుని సెలెక్ట్ చేసే దుస్థితి

- ప్రతిభతో క్రీడల్లో రాణించే పరిస్థితి లేకపోవడం బాధాకరం
- వీటికి చరమ గీతం పాడాలి
- రాబోయే దశాబ్ద కాలానికి కేంద్రం "ఖేలో ఇండియా" మిషన్ ఏర్పాటు
- ప్రతిభకు పట్టం కట్టడంతోపాటు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఘనంగా ముగిసిన "ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్" ఉత్సవాలు
- విజేతలకు స్వయంగా బహుమతులు అందించిన బండి సంజయ్







**కరీంనగర్ వెలుతురు మార్చి 08:**
రాష్ట్రంలో ప్రతిభతో క్రీడల్లో రాగణించే పరిస్థితి లేకపోవడం బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిదర్శనమన్నారు. హెచ్ సీఏలో సెలెక్ట్ కావాలంటే పైరవీ లు, డబ్బులు తీసుకొని సెలెక్ట్ చేసే సంస్కృతిని కొందరు తీసుకొచ్చారని, క్రీడాకారుల ప్రతిభను దెబ్బతీసే దుర్మార్గానికి చరమ గీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం రాబోయే దశాబ్ద కాలానికి గాను 'ఖేలో ఇండియా మిషన్' ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ మిషన్ ద్వారా క్రీడాకారుల్లోని సమగ్ర ప్రతిభాభివృద్ధికి మార్గం చూపడంతోపాటు కోచ్‌లు, సహాయక సిబ్బంది వ్యవస్థాగత అభివృద్ధికి క్రుషి చేస్తుందన్నారు. స్పోర్ట్స్ సైన్స్ & టెక్నాలజీ సమీకరణతోపాటు క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోటీలు, లీగ్స్ పేరిట క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడా శిక్షణ, పోటీల కోసం క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు ప్రారంభించిందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని క్రీడాకారుల కోసం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 1 నుండి 7 వరకు "ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్"పేరిట వారం రోజులపాటు ఆటల పోటీలు నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం లోని అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో వివిధ క్రీడా పోటీల్లో అర్హత సాధించి, విజేతలుగా నిలిచిన టీంలకు , పార్లమెంటు స్థాయిలో జరిగిన పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులకు, జట్లకు ఈరోజు మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ సమీపంలోని హోటల్ "త్రిద"లో బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తో పాటు కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంగా డి కృష్ణారెడ్డి, , నగరపాలక సంస్థ మేయర్ డిప్యూటీ మేయర్ కోలగని శ్రీనివాస్, సునీల్ రావు , పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లు గుజ్జ శ్రీనివాస్, మాడ వెంకటరెడ్డి, కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవన శైలిలో క్రీడలు ఒక భాగమని, క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకునే కాకుండా, మానసిక సమస్యలను దూరం చేస్తాయన్నారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. క్రీడలు క్రమశిక్షణ, బృందస్ఫూర్తి, చెట్టుగా పనిచేసే తత్వం, నాయకత్వ లక్షణాలు, వ్యూహరచన నైపుణ్యం, విమర్శనాత్మక ఆలోచన అలవాడేలా చేస్తాయన్నారు. ఈ ఆధునిక కాలంలో విద్య ఎంత అవసరమో క్రీడలు అంతే అవసరం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతి పార్లమెంటు నియోజకవర్గం ఈ క్రీడలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఈ క్రీడా పోటీలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ముఖ్యంగా యువతకు ఇదొక మంచి వేదిక అయిందన్నారు.

## ఆర్థికంగా అధికారికంగా మహిళలు ఎదగాలి

**- శంకర్పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్ కుమార్**





**శంకర్పల్లి, వెలుతురు మార్చి 8 :**
మహిళలందరూ ఆర్థికంగా, అధికారికంగా అభివృద్ధి చెందినప్పుడే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అర్థం ఉంటుందని శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్ నరేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నాడు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శంకర్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని స్టాఫ్ నర్స్ కృపా దేవిని శాలువతో సన్మానించి, అనంతరం ఓ గుడిసెలలో నివసించే కూలీ మహిళను కూడా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మాత, పిత, గురువు, దైవం లలో మొదటి స్థానం స్త్రీ లదే అని, అలాంటి స్త్రీలను సమాజం గౌరవించాలని తెలిపారు. నేటి ప్రతి విద్యార్థిని, మహిళలందరూ ఓ రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయిల వలె కీర్తి ని సాధించి, ఎదగాలన్నారు. వచ్చే మహిళా దినోత్సవం నుండి అయినా రాజ్యాంగం ప్రకారం భారత ప్రభుత్వం దేశంలోని సగం మహిళలను ఆర్థికంగా ఆదుకొని వారి కష్టాలను దూరం చేయాలని నరేష్ కుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మహేష్ యాదవ్, వైభవ్, నరసింహారెడ్డి, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు అనంతరం కార్యక్రమానికి హాజరైన మహిళలకు స్వీట్లు పంచి పెట్టి శుభాకాంక్షలు తెలపడం జరిగినది.

https://epaper.velthuru.com

నల్గొండ వెలుతురు

## మహిళా దినోత్సవం సందర్భంగా సిబ్బందికి చీరలు పంపిణీ చేసిన సర్పంచ్



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 08:** నార్కెట్‌పల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ మహిళా సిబ్బందికి చీరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల సేవలను గుర్తిస్తూ వారికి గౌరవ సూచకంగా చీరలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు. సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ అందించిన ఈ గౌరవానికి మహిళా సిబ్బంది ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

## ఉపసర్పంచ్ సామ శిరీష ప్రవీణ్ రెడ్డి కి పెళ్ళిరోజు శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ దంపతులు



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 08:** నార్కట్‌పల్లి మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ సామ శిరీషప్రవీణ్ రెడ్డి దంపతుల పెళ్లి రోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్, వారి సతీమణి నాగలక్ష్మి మరియు జేరిపోతుల సత్తయ్య, పుల్లెంల ఫణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దంపతులకు మరెన్నో సంతోషకరమైన సంవత్సరాలు రావాలని వారు ఆకాంక్షించారు.

## మృతుల కుటుంబాలకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య





**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 08:** నార్కట్‌పల్లి మండలం షాపల్లి గ్రామానికి చెందిన తంగేండ్ల కమలమ్మ అనారోగ్యంతో మృతిచెందగా, వారి మృతదేహాన్ని నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కట్టంగూరు మండలం పరాడ గ్రామానికి చెందిన బొబ్బలు రాములమ్మ గారి దశదినకర్మ కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కట్టంగూరు మండలం కల్మేర గ్రామానికి చెందిన ముసుకు శంకర్ గారి మాతృమూర్తి అనారోగ్యంతో మృతిచెందగా, వారి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


## చేనేత కార్మికుల వినతి



**మోత్కూర్,మార్చి 8,(వెలుతురు న్యూస్ ):** గౌరవ శాసనసభ సభ్యులు శ్రీ.మందుల సామేల్ గారికి ఆదివారం నాడు పాలడుగు గ్రామంలో చేనేత కార్మికులు వినతి పత్రం ఇచ్చారు . సుమారు 15 నెలల క్రితం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన సభలో గౌరవ ముఖ్యమంత్రి గారు చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఒక్కొక్కరికి ₹1 లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. అయితే ఇప్పటివరకు రాష్ట్రంలోని అనేక మంది చేనేత కార్మికులకు ఈ రుణమాఫీ అమలు కాలేదు. అలాగే తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ (ఒప్తతీఅట్) పథకం కింద ప్రతి నెల మేము మా వంతు మొత్తాన్ని ఖాతాలో జమ చేస్తున్నాము. ఈ పథకం ప్రకారం ప్రభుత్వం మా జమకు మూడు రెట్లు నిధులు జమ చేయాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వం వాటిని క్రమంగా జమ చేయడం లేదు. చేనేత రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నందున, పై సమస్యలను గమనించి చేనేత కార్మికులకు ప్రకటించిన రుణమాఫీని త్వరితగతిన అమలు చేయడం త్రిఫ్ట్ పథకం కింద ప్రభుత్వం జమ చేయవలసిన నిధులను వెంటనే విడుదల చేయడం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకునేలా మీ వంతు సహకారం అందించాలని మనవి చేశారు .ఈ కార్యక్రమంలో మాజీ చేనేత సహకార సంగం అధ్యక్షుడు జెల్లా.నాందేవ్,జిల్లా చేనేత కార్మిక సంఘం కార్యదర్శి గుండు వెంకటనర్సు, జెల్లా. సత్యనారాయణ, శ్రీను,సోమరాజు,లక్ష్మయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

## ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రం ఆవిష్కరణ

### *ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా షెడ్యూల్ కులాల సంక్షేమ పథకాల అమలుకు ధర్నా.*



**మోత్కూర్, మార్చి 8,(వెలుతురు న్యూస్ ):** మోత్కూర్ మండల కేంద్రంలో ఆదివారం నాడు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ పిలుపుమేరకు మోత్కూర్ మండల కేంద్రంలో బాబు జగ్జీవరావు విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా ఎస్సీల సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని సోమవారం రోజున కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెల్ల రమేష్ మాదిగ రాష్ట్ర కార్యదర్శి వైరపాక నాగరాజు మాదిగ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంఘ స్వామి మాదిగ మోత్కూర్ మండల్ అధ్యక్షులు బందెల శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు వ్యాక్సిన్

**- ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ శ్వేతా ప్రియాంక**





**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 08:** ఏరియా హాస్పిటల్, రామన్నపేట అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 08.03.2026 న రామన్నపేట ఏరియా హాస్పిటల్‌లో హెచ్ పి వి వ్యాక్సిన్ ,(హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సిన్) కార్యక్రమాన్ని ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డా శ్వేత ప్రియంక చే ప్రారంభించడం జరిగింది. గర్భకోశ ముఖ క్యాన్సర్ నివారణకు భాగంగా, 14 వ పుట్టినరోజు పూర్తి చేసుకుని 15 వ సంవత్సరం నడుస్తున్న బాలికలకు ఈ టీకాను ఇవ్వడం జరుగుతోంది. కార్యక్రమం ప్రారంభదినాన మొత్తం 17 మంది బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ అందజేయబడింది. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ డాక్టర్స్ పిల్లల వైద్యులు డా. వీరన్న , డా. రాజా గోపాల్ స్త్రీ వైద్య నిపుణులు, టిబి ప్రోగ్రాం ఆఫీసర్ డా. వంశీ కృష్ణ , మునిపంపుల వైద్యాధికారి డా. అశ్విని కుమార్ పిపి యూనిట్ వైద్యులు డాక్టర్ పురుషోత్తం హెచ్ ఈ ఓ గోపాల్ , సూపర్వైజర్ వాణిశ్రీ ఏఎన్ఎం మంజుల , ఏఎన్ఎం సాధియ హెల్త్ అసిస్టెంట్ మల్లేష్ డీఈవో రమేష్ ఎల్ టి సతీష్ గారు, స్టాఫ్ నర్సులు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, గర్భకోశ ముఖ క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్ పి వి వ్యాక్సిన్ ముఖ్యమైన రక్షణ అని తెలిపారు. 15 సంవత్సరాలు ఉన్న బాలికలు అందరూ ఈ టీకాను తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం

**- రామన్నపేట పట్టణ అభివృద్ధికి ప్రతేక నిధులు కేటాయించాలి.**

**- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 08:** రామన్నపేటలో ఇంటింటికి సిపిఎం కార్యక్రమం ప్రజలకు కనీస మౌళిక సౌకర్యాలు కల్పించి ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలం చెందుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రామన్నపేట పట్టణ కేంద్రంలో ఇంటింటికి సిపిఎం కార్యక్రమం స్థానిక నాయకులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను నేరుగా కలిసి సమస్యలు తెలుసుకొని సిపిఎం ప్రజా ఉద్యమాలకు ప్రజావిరాళం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకనాటి పాత తాలూకా, నియోజకవర్గ కేంద్రమైన రామన్నపేట నేడు సమస్యల వలయంలో ఉన్నాడని. పట్టణ అభివృద్ధికి 20 కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేయాలని అన్నారు. పారిశుధ్య లోపం, తాగునీటి సమస్యపై ప్రత్యేక చొరవ చూపి ప్రజా పార్కులను ఏర్పాటు చేయాలన్నారు. అధిక వర్షాలు సంబవించినప్పుడు వరదల కారణంగా ఇండ్లలోకి నీరు వస్తుందని. డ్రైనేజి పక్కద్బెందీగా ఏర్పాటు చేయాలన్నారు. పూర్తి స్థాయిలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేసి కోతులు, కుక్కలు, పందుల బెడద నుండి ప్రజలను కాపాడాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌళిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. సిపిఎం ప్రజా పోరాటలకు ప్రజా విరాళం అందించి సమస్యల పరిష్కారంకై జరిగే ఉద్యమాలకు ప్రజలు బాసటగా నిలవాళన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలపై ప్రజలతో నిరసన కేంద్రంలో ఉన్న బీజేపీ ధరలను పెంచి సామాన్యులపై పెనుభారాలు మోపుతుందని స్థానిక ప్రజలతో కలిసి గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలపటం జరిగింది. యుద్దాల కారణం చూపి పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలను పెంచి బీజేపీ ప్రభుత్వం పెదాలపై పెనుభారాలు మోపుతుందని, దేశంలో సామాన్య పేదల బ్రతికే పరిస్థితి లేదని అన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని లేని పక్షంలో ప్రజలు తిరగబడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యుడు కందుల హనుమతు, మండల కమిటి సభ్యులు గొరిగే సోములు, బావండ్లపల్లి బాలరాజు, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్,నాయకులు పల్లె సత్యం, బావండ్లపల్లి సత్యం, బాబూచారి, వేముల మల్లేశం, బండ శ్రీశైలం, మునికుంట్ల రాణి, కుందూరు వెంకటేశం, రాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సమ్మిగౌడ్ ఫౌండేషన్ శ్రీకాంత్ గౌడ్ కుటుంబానికి కొండంత అండ

**క్వింటా బియ్యం, ₹3000 ఆర్థిక సాయం అందజేసిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్య గౌడ్**

**పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి ధైర్యం.. భరోసా సమ్మిగౌడ్‌లి- లినరేటి సత్తయ్య - కొమురయ్య గౌడ్**





**కేసముద్రం వెలుతురు మార్చి 08:** కేసముద్రం మండల కేంద్రంలోని తాళ్లపూస పల్లి గ్రామానికి చెందిన నరేటి యాదగిరి – ఎల్లమ్మ దంపతుల కుమారుడు నరేటి శ్రీకాంత్ గౌడ్ మరణం స్థానికంగా పెను విషాదాన్ని నింపింది. ఈ వార్త తెలిసిన వెంటనే సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ బాధిత నివాసానికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన ఆయన, ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా ఒక క్వింటా బియ్యం మరియు 3000 రూపాయల నగదును అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ.. "చిన్న వయసులోనే శ్రీకాంత్ మనల్ని విడిచి వెళ్లడం అత్యంత బాధాకరం. కష్టపడి పైకి వస్తున్న యువకుడు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం ఆ కుటుంబానికి, తల్లీ తండ్రులకు కోలుకోలేని లోటు భౌతికంగా తమ కొడుకు లేని లోటు తీర్చలేకపోయిన ఒక కొడుకులా సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఎల్లవేళలా ఈ కుటుంబానికి రక్షణగా, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ మృతికి ఘన నివాళులు కేజీకేఏస్ సొసైటీ అధ్యక్షులు నరేటి సత్తయ్య,కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు కొమురయ్య గౌడ్ , నరేటి నారాయణ, మాజీ సర్పంచ్ కందుకూరి దాస్, వేముల యాదగిరి, వల్లాల వెంకన్న, ముత్తిలింగం, కొమురయ్య, నరేటి ముత్తయ్య, వేముల కొమురయ్య, వల్లాల కాశీనాథ్, నరేటి విజయ్, నరేటి సంతోష్, వంగ సాగర్, వంగ సురేంద్, వల్లాల ప్రశాంత్, మెంచు వంశీ, వల్లాల రాజేందర్, నరేటి నరేష్, నరేటి వేణు, సాయి, కోమిరే ప్రశాంత్, మందుల మహేష్, మందా శ్రీకాంత్, గుర్రాల అశోక్, తీగల సునీత, మెశీచు పద్మ, వంగ యశోద, వల్లల యశోద, వేముల సుశీల, వాళ్ళల సుభద్ర, అరుణ, వాళ్ళలా అనిత, వేముల రాధిక, గుండ్ల ఉమా, వాళ్ళల మౌనిక, సౌజన్య సహా పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని శ్రీకాంత్. ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు..

## మహిళా రిజర్వేషన్ లో బీసీ మహిళలకు సబ్ కోటా ఉండాల్సిందే

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**





**మిర్యాలగూడ వెలుతురు మార్చి 08:** మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా ఉండాల్సిందేనని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని ఎండిఓ కార్యాలయం నందు రైతు వేదికలో మహిళా నాయకురాలు బంటు కవిత చిత్రం ఉమా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శాలువా మెమెంటోతో సత్కరించారు. ముఖ్య అతిదిగా హాజరై బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ మహిళలు బలబడితేనే కుటుంబాలు బాగుపడతాయని, మహిళ లేనిదే సమాజ మనుగడ లేదని అన్నారు. మహిళా రిజర్వేషన్లలో బిసి మహిళలకు సబ్ కోటా ఉండాల్సిందేనని అన్నారు. ఉద్యోగాలు చేసే చోట మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు మొండి కత్తి లింగయ్య నాగేశ్వరావు యాదవ్ చేగొండి మురళి సురేష్ యాదవ్ దాక్ష రెడ్డి డాక్టర్ శ్రీదేవి అడ్వకేట్ అరుణ హెడ్మాస్టర్ ఝాన్సీ మేడం హెడ్ మాస్టర్ మంజుల వార్డెన్ లీలా హోంగార్డ్ శిరీష నాగలక్ష్మి కల్పనా లలిత సైదమ్మ దుర్గాభవాని జానకమ్మ శాంత తదితరులు పాల్గొన్నారు

## మార్చి 17నుంచి ఎంజియూ డిగ్రీ సంవత్సరం వారీగా పరీక్షలు

**- కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాహత్ ఖానం**




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి08:** మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో ఇయర్ వైస్ విధానంలో చదివిన విద్యార్థులకు బ్యాక్ లాగ్ పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ రాహత్ ఖానం,అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.చిన్నబాబు ఒక ప్రకటనలో తెలిపారు.హాల్ టికెట్లను పరీక్షలకు ఒక రోజు ముందుగా రామన్నపేట డిగ్రీ కళాశాలలో పొందవచ్చని తెలిపారు.

## నూతన దంపతులు అనుదీప్, స్నేహలను ఆశీర్వదించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**మిర్యాలగూడ వెలుతురు మార్చి 08:** నక్క శ్రీనివాస్,నాగలక్ష్మి దంపతుల కుమారుడు అనుదీప్ స్నేహల వివాహం స్థానిక నందిపాడు బైపాస్ రోడ్ లోని జె ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన వివాహ మహోత్సవానికి హాజరై నూతన దంపతులను బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు ఉన్నారు.

## నూతన దంపతులు దూళిపాళ్ల శివకుమార్, సహజలను ఆశీర్వదించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**మిర్యాలగూడ వెలుతురు మార్చి 08:** ఆంధ్రజ్యోతి జర్నలిస్ట్ కలిమెల నాగన్న,రాణిల కూతురు సహజ,శివకుమార్ ల వివాహం స్థానిక రామచంద్రగుండ లోని ఎస్.వి గార్డెన్ లో జరిగిన వివాహ మహోత్సవానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు వెంకన్న యాదవ్ ఉన్నారు

## పెంబర్తిలో హస్తకళలను పరిశీలించిన కేసీఆర్ సతీమణి శోభ

**జనగామ రూరల్ వెలుతురు మార్చి 08:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సతీమణి కల్వకుంట్ల శోభ ఆదివారం జనగామ జిల్లా జనగామ మండలం పెంబర్తి గ్రామానికి వెళ్లారు. హైదరాబాద్ నుంచి వరంగల్ పర్యటనకు వెళ్తున్న ఆమె.. దారిలో ఆ గ్రామంలో ఆగారు. అక్కడ రోడ్డు పక్కనే ఉన్న గణేష్ హ్యాండ్ క్రాఫ్ట్ షోరూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా షాప్‌లో ఉన్న బుడిగే శ్రీనివాస్ దంపతులు ఆమెకు సాధారణంగా స్వాగతం పలికారు. ఆమెను షాపులోకి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కేసీఆర్ సతీమణి షాప్‌లో ఉన్న హస్తకళలను పరిశీలించారు. మెటల్ షీల్డ్స్‌ను పరిశీలించి బాగున్నాయని చెప్పారు. అలాగే దేవుళ్ళ ప్రతిమలను చూసి వాటి తయారీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. షాపులో ఉన్న వివిధ రకాల వస్తువులను బుడిగే శ్రీనివాస్ దంపతులు ఆమెకు వివరించి చెప్పారు. అనంతరం జనగామ మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దే సిద్ధి లింగం.. కేసీఆర్ సతీమణిని కలిశారు. కేసీఆర్ గారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సతీమణి పెంబర్తికి వచ్చారని తెలిసి గ్రామస్తులు భారీగా తరలివచ్చారు.

## జాడిమాల్కాపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం పేదల సొంతింటి కల సాకారం

**- పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం...**

**- రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 8:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేదల సొంతింటి కలను నిజం చేయడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా మొగడంపల్లి మండలం జాడిమాల్కాపూర్ గ్రామంలో పెద్దగొల్ల మల్లేశం నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలబడి వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ప్రజల ఆశలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద కుటుంబాలకు స్థిర నివాసం కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడు పెద్దగొల్ల మల్లేశం మరియు ఆయన కుటుంబ సభ్యులు ఉజ్వల్ రెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అశ్విన్ పాటిల్, గ్రామ నాయకులు ముకుంద్ రెడ్డి, రాజిరెడ్డి, పులేందర్ రెడ్డి, శరణప్ప, శ్రీనివాస్ రెడ్డి తదితరులతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బండలేమూర్ గ్రామంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో మల్లన్నగుడి వద్దబోరు వేయించిన యాదవ సంఘం పెద్దలు

**- అడగగానే బోర్ వేయించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు**

**- మల్లన్నగుడి చైర్మన్ వట్టి యాదయ్య యాదవ్ యాదవ సంఘం పెద్దలు గ్రామపెద్దలు**



**మంచాల వెలుతురు మార్చి 08:**
మంచాల మండలం బండలేమూర్ గ్రామంలో యాదవ సంఘం కోరిక మేరకు మల్లన్నగుడి నిర్మా ణం కోసం దేవాదాయశాఖ నుండి 50 లక్షల రూపాయలు మంజూరు చేయించిన ఇబ్రహీంప ట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి గుడి నిర్మాణానికి నీటి కొరత ఉందని యాదవ సంఘం నా యకులు కోరగానే వెంటనే బోరు వేయించిన ఇబ్రహీంపట్నం మల్ రంగారెడ్డి అడగగానే మల్లన్న గుడి నిర్మాణం కోసం అన్ని విధాలుగా సహకరిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన బండడలేమూర్ గ్రామంయాదవ సంఘం పెద్దలు గ్రా మ పెద్దలు ఈ కార్యక్రమంలో బండలేమూర్ గ్రామసర్పంచ్ పాతులోత్ శ్రీనివాస్ నాయక్ మల్లన్న గుడి చైర్మన్ వట్టి యాదయ్య యాదవ్ గ్రామ ఉపసర్పంచ్ బూడిది రమేష్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ముత్యాల ఐలయ్యయాదవ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రమావత్ జ నార్ధన్ నాయక్ మాజీ ఎంపీటీసీ వట్టి వెంకటేష్ యాదవ సంఘం గ్రామ అధ్యక్షుడు బద్దుల ర మేష్ యాదవ సంఘం పెద్దలు వట్టి పెద్ద పేద్దులు ఒట్టి సత్తయ్య గ్రామపంచాయతీ వార్డు సభ్యు లు జక్కలి సాలయ్య జేర్పుల కిషన్ మాజీ ఉపసర్పంచ్ వట్టి జంగయ్య వట్టి మహేష్ వల్లపు చె న్నయ్య గ్రామపెద్దలు తదితరులుపాల్గొన్నారు

# బంగిని మటం ఫౌండేషన్ ఆధ్వర్యంలో దండుమైలారం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవార్డులు ప్రధానం

**- బంగినిమటం ఫౌండేషన్ సేవలు అభినందనీయం దండుమైలారం గ్రామసర్పంచ్ ఇదులకంటి నరేష్ గౌడ్**

**ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 08:**



ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం పాఠశాలలో జిహెచ్ఎం వి గోవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన సమావేశంలో భంగినిమటం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత సంవత్సరం పదవ తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన టాపర్ 5 గురు విద్యార్థులకు అవార్డులు మరియు రివార్డ్ లు అందించడం ప్రస్తుత పదవ తరగతి విద్యార్థులకు మరియు పాఠశాల విద్యార్థులకు భవిష్య త్ లో మరిన్ని ప్రోత్సహకాలు అందజేస్తామని అన్నారు గతంలో కూడ ఫౌండేషన్ సభ్యులు విన య్ సార్ రవి కుమార్ సార్ మరియు వారి కుటుంబ సభ్యులు పాఠశాల కోసం కుర్చీలు మైక్ సె ట్ ఐడి కార్డ్స్ మరియు స్టడీ మెటీరియల్ అందించడం జరిగింది భవిష్యత్ లో కూడ పాఠశాల అభివృద్ధికి మరిన్ని సేవలు అందిస్తామని అన్నారు ఈకార్యక్రమనికి ముఖ్యఅతిధిగా హాజరైన గ్రామసర్పంచ్ ఇదులకంటి నరేష్ గౌడ్ మాట్లాడుతూ భంగినిమటం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా ర్థులు మరియు పాఠశాల ఉన్నతి కోసం చేస్తున్న సేవలు అభినందనీయం అని అన్నారు ఈ సందర్భంగా సర్పంచ్ మరియు వచ్చిన అతిథులు చేతుల మీదుగా సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించడం జరిగింది ఈకార్యక్రమంలో గ్రామఉప సర్పంచ్ విజయలక్ష్మి వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాఠ శాల ఉపాధ్యాయులు సిబ్బంది మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# లింగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సర్పంచ్

**- అర్హులైన పేద కుటుంబాలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తాం**

**- లింగంపల్లి గ్రామసర్పంచ్ అమ్మనబోలు సంజీవరెడ్డి ఉపసర్పంచ్ బద్దుల కుమార్ యాదవ్**



**మంచాల వెలుతురు మార్చి 08:**
మంచాల మండలం లింగంపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజల కోసంప్రవేశ పె ట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో బూర జ్యోతి కి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణానికి శంకు స్థాపన చేసిన లింగంపల్లి గ్రామ సర్పంచ్ అమ్మనబోలు సంజీవరెడ్డి ఉపసర్పంచ్ బద్దుల కుమార్ యాదవ్ ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం ఇంది రమ్మ ఇండ్ల పథకంచాలా బాగుందన్నారు ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి గారి పాలనలో ప్రజా పాల న ప్రభుత్వం అంటే ఏమిటో పాలనచేసి చూపిస్తున్న గొప్ప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో అర్హులైన ప్రతి పేద కు టుం బానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తాం ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతిపథకం పేదకుటుంబాలకు అందేలా కృషి చేస్తాం అని అన్నారు ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు పగడాల లాస్య గడ్డ మీది ప్రమీల పంతంగి కిష్టయ్య దంచుక బిక్షపతి వైఎస్సార్ అభిమాని బూర జంగయ్య గౌడ్ గ్రామస్తులు ఈగల కృష్ణ మైలారాపు యాదయ్యతదితరులు పాల్గొన్నారు

## భారతీనగర్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





**భారతీనగర్ వెలుతురు మార్చి 08:**
భారతీనగర్ డివిజన్ పరిధిలోని MIG సొసైటీ గ్రౌండ్‌లో మాజీ కౌన్సిలర్ శ్రీమతి పావని రవీందర్ గారి ఆధ్వర్యంలో స్త్రీ శక్తి మహిళా చైతన్య సంఘం ద్వారా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ గారు, వారి సతీమణి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా గారు, అలాగే శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ గారు హాజరయ్యారు. ముఖ్య అతిథులు ముందుగా మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మహిళల కోసం నిర్వహించిన పలు ఆటపోటీల్లో గెలుపొందిన విజేతలను అభినందించి వారికి సర్టిఫికేట్లు మరియు బహుమతులను అందజేశారు.

# మహిళల శక్తి సమాజ నిర్మాణానికి ప్రేరణ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో కాంగ్రెస్ నేతలు..

**కూకట్ పల్లి, మార్చి 8 వెలుతురు:**
అమ్మగా ప్రేమను, చెల్లిగా తోడును, భార్యగా బాధ్యతను పంచుతూ ప్రతి రూపంలో ప్రపంచాన్ని ముందుకు నడిపించే మహత్తర శక్తి మహిళలదేనని మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి పట్నం సునీత మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి పట్నం సునీత మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మహిళను శక్తి స్వరూపిణిగా భావిస్తారని తెలిపారు. కుటుంబాన్ని నిలబెట్టే తల్లి ప్రేమ, అక్కగా ఆప్యాయత, భార్యగా జీవితానికి అండగా నిలిచే ధైర్యం, సమాజానికి దిశానిర్దేశం చేసే నాయకత్వం మహిళల్లో సహజసిద్ధంగా ఉంటాయని పేర్కొన్నారు. మహిళల పాత్ర కుటుంబానికే కాకుండా దేశ అభివృద్ధికి కూడా అత్యంత ముఖ్యమని ఆమె అన్నారు. అనంతరం సత్యం శ్రీరంగం



మాట్లాడుతూ మహిళల ధైర్యం, సాధన సమాజానికి ప్రేరణగా నిలుస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మహిళల గౌరవం, భద్రత, సమాన హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళలకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక సాధికారతను పెంపొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మహిళలు బలంగా ఉంటే దేశం కూడా బలంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ విభాగాల నాయకులు, మహిళా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మైనారిటీ, ఎస్సీ, బీసీ సెల్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

# కామ్రేడ్ దుర్గన్న సేవలు మర్చిపోలేనివి

**-సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్.**

**కుత్బుల్లాపూర్ మార్చి 08 (వెలుతురు ప్రతినిధి):**
భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కుత్బుల్లాపూర్ మండల మాజీ సహాయ కార్యదర్శి,దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ దుర్గన్న సంతాప సభ నేడు జగతగిరిగుట్ట సిపిఐ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్,దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ లు పాల్గొని మాట్లాడుతూ తండ్రి సాయిలు పట్టిన జండాను వారసత్వాన్ని పునికిపుచ్చుకుని ఎర్రజండాను పట్టుకొని పేద ప్రజల కోసం పనిచేస్తూ వారికీ తగిన సహాయ సహకారాలు అందించే వాడని ఎప్పుడు ఎవరు ఏమి అడిగినా కాదనే వ్యక్తని అన్నారు.భౌతికంగా తను లేకున్నా అన్ని ప్రాంతలో తను గుర్తుండి పోతాడని అన్నారు.దుర్గయ్య చేసిన సేవలను అందరు కొనసాగించాలని అదే ఆయనకు మనం ఇచ్చే నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా



కార్యదర్శి ఉమా మహేష్,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం,మండల కార్యదర్శి స్వామి,తెలంగాణా సాంస్కృతిక సలహా మండలి సభ్యులు దరువు అంజన్న, రచయిత మోహన్ బైరాగి,ఎన్ ఎస్ యు ఐ నాయకులు సాయి,ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్,బాబ,భాస్కర చారి సహాయ కార్యదర్శి రాములు,సిపిఐ నాయకులు నర్సయ్య,నర్సింహా రెడ్డి,జర్నలిస్ట్ నాయకులు యాకస్వామి, రామస్వామి, బాలరాజ్, వెంకట్, సదానందం, సాయిలు, సహదేవ రెడ్డి, శ్రీనివాస్, కొండయ్య, యాదగిరి,భేమేష్,తదితరులు పాల్గొన్నారు.

# కీ.శేలు ఆకు మడుపుల రజనీకాంత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తాం

**- ట్రస్ట్ చైర్మన్ ఆకుమడుపుల నరేంద్ర స్వరూప్**




**కరీంనగర్ వెలుతురు మార్చి 08:**
కీ.శే.లు ఆకుమడుపుల రజనీకాంత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని ట్రస్ట్ చైర్మన్ ఆకుమడుపుల నరేంద్ర స్వరూప్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ (ఎల్ఎండి కాలనీ) లో కరీంనగర్ జిల్లా స్వాతంత్ర సమరయోధుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థుల కోసం ఆదివారం రోజున కీ.శే.లు ఆకుమడుపుల రజనీకాంత్ సేవా ట్రస్ట్ 8 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సేవా ట్రస్టు చైర్మన్ ఆకు మడుపుల నరేంద్ర స్వరూప్ , హనుమంతు , కల్లూరి సోమనాదం లు మాట్లాడుతూ ఆకుమడుపుల రజనీకాంత్ జీవించి ఉన్న కాలంలో ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాల కోసం తన వంతు చేయుతని చ్చారన్నారు . ఆపదల్లో, కష్టాల్లో ఉన్న ఎంతోమంది అభాగ్యులను, నిస్సహాయులను ఆదుకోవడానికి రజినీకాంత్ తగిన సహాయ సహకారాలు



అందించారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. చిన్న వయసులో రజినీకాంత్ అకాల మరణం చెందడం బాధాకరమని , ఆయన మా కుటుంబం మధ్య లేకపోవడం ఎంతో వేదన కలిగిస్తుందన్నారు. రజినీకాంత్ జీవితం చెరిగిపోని జ్ఞాపకం లాంటిదని , అందుకే ఆయన సేవ గుణం కొనసాగించాలనే ఆశయంతో, స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలనే సంకల్పంతో ట్రస్టును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ప్రోగ్రాం అనంతరం ట్రస్టు సభ్యులు విద్యార్థులకు అన్న ప్రసాద వితరణ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సిబ్బందిని సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆకు మడుపుల శ్రీనివాస్, ఆకుమడుపుల సంధ్యారాణి–రజనీకాంత్, కొట్టాల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ సోమనాదం కల్లూరి, టీఎన్జీవో నేతలు అంబటి నాగరాజు , పోలు కిషన్ , మహాత్మా నగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ కేతిరెడ్డి అంజిరెడ్డి , వార్డు సభ్యులు పొన్నాల తిరుపతి, మహిళా వార్డు సభ్యులు , మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం

**- నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి.**



**కుత్బుల్లాపూర్ మార్చి 08 (వెలుతురు ప్రతినిధి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 284 డివిజన్ గణేష్ నగర్ కాలనీ వాసులు బోలె సుబ్బారావు గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నరు చికిత్సకి సరిపడ్డ డబ్బులు లేక స్థానిక మాజీ కార్పొరేటర్ కే ఏం గౌరీష్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా వెంటనే సుబ్బారావు కి స్పందించి గౌరవ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,50,000/– ల సీఎం సహాయనిధి – ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ 2,50,000/– (రెండు లక్షల యాభై వేల రూపాయలు ) CMRF ` LOC మంజూరి పత్రాలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవపురం కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ మార్చి 08 (వెలుతురు ప్రతినిధి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మహాదేవపురం కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇంటి రిజిస్ట్రేషన్ మరియు నూతన ఇంటి నిర్మాణం అనుమతులు మరియు వారి స్థలాలను ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చడం వంటి సమస్యల క్రమబద్ధీకరణ గురించి ఆదివారం వారి సమస్యలను స్థానిక మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు.. ఈసందర్భం గా వారు కాలనీవాసులతో మాట్లాడుతూ... కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు దుదిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి మరియు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి, కాలనీవాసులు ప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, రామచంద్రరెడ్డి, ప్రవీణ్ కుమార్, జంగారెడ్డి మరియు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ.. సర్వదర్శనానికి 3 గంటలు సమయం

**యాదాద్రి భువనగిరి వెలుతురు మార్చి 08:**
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొన్నది. స్వామివారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. లక్ష్మీనారసింహుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. వేకువ జాము నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. దీంతో ఉచిత సర్వదర్శనానికి మూడు గంటల సమయం పడుతున్నది. ప్రసాదం కౌంటర్ల వద్ద కూడా క్యూలైన్లు నిండిపోయాయి. మాడ వీధులు, క్యూ లైన్లు, శివాలయంలో భక్తులతో నిండి పోయాయి. బస్టాండ్ ప్రాంగణం, వీవీఐపీ పార్కింగ్‌లు వాహనాలతో రద్దీగా మారింది.

# మహిళా దినోత్సవం సందర్భంగా జహీరాబాద్‌లో భారీ ఉచిత కాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

**- ఫిల్లింగ్ గ్రోత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టార్ హాస్పిటల్, బ్లైజెన్ బయోకేర్ సహకారం...**

**- 91500 మంది మహిళలకు ఉచిత పరీక్షలు....**

జహీరాబాద్ వెలుతురు మార్చి 8:
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని డాక్టర్ ఆర్.ఎల్.ఆర్ జూనియర్ కళాశాలలో మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం మరియు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఫిల్లింగ్ గ్రోత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టార్ హాస్పిటల్ మరియు బ్లైజెన్ బయోకేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు కాన్సర్‌కు సంబంధించిన ఉచిత చెకప్‌లు, స్కానింగ్ పరీక్షలు




నిర్వహించి, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. శిబిరానికి పట్టణం మరియు పరిసర ప్రాంతాల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 1500 మంది మహిళలకు ఉచితంగా కాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.



కాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చని, అందుకే మహిళలు తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరమని వైద్యులు సూచించారు. అలాగే మహిళల్లో సాధారణంగా కనిపించే స్తన కాన్సర్, గర్భాశయ కాన్సర్ లక్షణాలు, నివారణ మార్గాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఈ కార్యక్రమాలను విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా పాఠశాలలు మరియు కళాశాలలకు వెళ్లి 9 సంవత్సరాల వయస్సు గల ఆడపిల్లలకు కాన్సర్ స్క్రీనింగ్ పై అవగాహన కల్పించడంతో పాటు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళల్లో కాన్సర్‌పై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో మంచి అవగాహన పెరిగిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఫౌండేషన్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

